# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 040-27624030/31, 29704032

# దెబోరా స్వరం

సంపుటి : 11 సంచిక : 2 | మార్చి - ఏప్రిల్ 2018 | విడి ప్రతి వెల రూ. 5/-


## పునరుత్థానమును జీవమును నేనే – యోహాను 11:25



జాయ్ చెరియన్

**సంపాదకురాలి కలమునుండి...**

'దెబోరాస్వరం' పాఠకులకందరికి క్రీస్తు నామములో పునరుత్థాన శుభములు.

**"అందుకు యేసు – పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు."**

– యోహాను 11:25,26

ప్రభువుయొక్క పునరుత్థానమునకు సంబంధించిన నామములు ధ్యానించడము విశ్వాసులమైన మనకు బలము, శక్తి, జీవము. ఆయన పునరుత్థానమును జీవమునైయున్నాడు.

**"విశ్రాంతిదినము గడచిపోగానే మగ్దలేనే మరియయు యాకోబు తల్లియైన మరియయు సలోమేయు వచ్చి, ఆయనకు పూయవలెనని సుగంధద్రవ్యములు కొనిరి. వారు ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు సమాధియొద్దకు వచ్చుచుండగా, – సమాధి ద్వారమునుండి మనకొరకు ఆ రాయి యెవడు పొర్లించునని ఒకరితో ఒకరు చెప్పుకొనుచుండిరి. వారు వచ్చి కన్నులెత్తిచూడగా, రాయి పొర్లింపబడి యుండుట చూచిరి. ఆ రాయి యెంతో పెద్దది. అప్పుడు వారు సమాధిలో ప్రవేశించి, తెల్లని నిలువుటంగీ ధరించుకొనియున్న యొక పడుచువాడు కుడివైపున కూర్చుండుట చూచి మిగుల కలవరపడిరి. అందుకతడు – కలవరపడకుడి సిలువ వేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు; ఆయన లేచియున్నాడు, ఇక్కడ లేడు;"**

– మార్కు 16:1-6

ప్రభువు సిలువమరణము తరువాత మూడవరోజున పునరుత్థానుడనౌతానని సెలవిచ్చాడు. ఆలాగుననే ఆయన లేచియున్నాడు. కావలివారు, సమాధి, ముద్రింపబడిన పెద్దరాయి, ఏదికూడ ఆయన పునరుత్థానమును ఆపలేకపోయాయి. యేసుక్రీస్తు సర్వలోక పాపపరిహారార్థము సిలువలో మరణించి మానవాళికి రక్షణ, విమోచనను అనుగ్రహిస్తే, ఆయన పునరుత్థానము విశ్వాసికి జయమును, నిరీక్షణను అనుగ్రహించింది.

ప్రభువుయొక్క దేహమునకు సుగంధద్రవ్యములు పూయవలెనని మగ్దలేనే మరియయు, యాకోబు తల్లియైన మరియయు, సలోమేయు విశ్రాంతి దినమున పెందలకడనే లేచి సమాధియొద్దకు వచ్చారు. సమాధి రాయిచేత భద్రముగా ముద్రింపబడియుంది. ఆ రాయి మాకొరకు ఎవరు పొర్లిస్తారని అనుకున్నారు. వారు స్త్రీలు కనుక ఆ రాయిని పొర్లించలేరు. అక్కడ కావలివారుకూడ యుంటారు. ఏలాగు ప్రభువు దేహమునకు సుగంధద్రవ్యములు పూయగలమని వారి హృదయములో సందేహముంది. వారు ఆలోచిస్తు సమాధి దగ్గరకు రాగానే ఆ పెద్దరాయి పొర్లింపబడియుంది. హల్లెలూయా! దేవునికి స్తోత్రము! ఆ రాయి దానంతట అదే పొర్లింది. అదే పునరుత్థానశక్తి. యేసుప్రభువు పునరుత్థానుడయ్యాడు. ఇప్పటికి ఆయనను ఉంచిన సమాధి ఖాళీగానే ఉంది. ఆయన సమాధిని గెలిచాడు, బండను గెలిచాడు, కావలివారిని, ముద్రను గెలిచాడు. ఆయన పునరుత్థాన మహిమశరీరమును ఇవేవి అడ్డగించలేక పోయాయి. ఆయన సజీవుడైయున్నాడు. ఆయన అక్కడ లేడు. ఖాళీ సమాధి మాత్రమే ఉంది. ఆయన పునరుత్థానమును జీవమునై యున్నాడు.

ఒక ఉదయకాలము 3 గంటల సమయములో నేనొక దర్శనము చూశాను, ఒక స్వరము విన్నాను. ప్రభువంటున్నాడు – పునరుత్థాన బలముతో నేను మీ సంఘమును నింపబోతున్నాను. యు.పి.ఎఫ్.కి వచ్చే ప్రతి బిడ్డ జీవితములో ఎలాంటి సమస్యలున్నను అవి పొర్లింపబడతాయి. ప్రతి ఒక్కరిని పునరుత్థానశక్తితో నింపబోతున్నాను అనే మాటలు విన్నాను. దేవునికి స్తోత్రము. ప్రతి కుటుంబములో బండలాంటి సమస్యలుంటాయి. ఈ బండను మాకొరకు ఎవరు పొర్లిస్తారనే సందేహము కలిగియుంటారు. భయపడకండి, ఈ నామమెత్తి ప్రార్థనచేసినప్పుడు పునరుత్థానుడైన ప్రభువు తన శక్తిచేత సమస్యలనే బండలను తొలగిస్తాడు.

ప్రభువు పునరుత్థానుడైన తరువాత 40 రోజులు అనేకులకు ప్రత్యక్షమయ్యాడు. శిష్యులకు తన్ను తాను ప్రత్యక్షపరచుకున్నాడు. వారిలోని

భయమును, పిరికితనమును, అవిశ్వాసమును చెదరగొట్టాడు. పిరికివారిని ధైర్యవంతులుగా, అవిశ్వాసులను విశ్వాసులుగా, బలహీనులను బలవంతులుగా మార్చాడు. పరిశుద్ధాత్మను వారిమీద ఊది – మీరు పరిశుద్ధాత్మను పొంది సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించమని ఆదేశించాడు. వారిని అపొస్తలత్వమునకు పిలిచి, పరిశుద్ధాత్మను కుమ్మరించాడు. శిష్యులు తమ ప్రాణములు సహితము లెక్క చేయకుండ అంతమువరకు సిలువనుగూర్చిన వార్తను చాటించారు. పునరుత్థాన బలముతో ప్రభువుకొరకు హతసాక్షులయ్యారు.

ప్రభువు – తనను సిలువ మరణమునకు అప్పగిస్తారని, అయినను మూడవరోజున నేను తిరిగి లేస్తానని ముందే చెప్పాడు. నేను జీవించు చున్నాను కనుక మీరును జీవిస్తారని చెప్పాడు.

**"నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు."**

– యోహాను 14:19

ఆయన చనిపోయి మరణమును జయించి పునరుత్థానుడయ్యాడు. ఆయన సజీవుడు. సజీవుడైన దేవుని మనము ఆరాధిస్తున్నాము. సజీవుడైనవానిని మృతులలో ఎందుకు వెదకుచున్నారు? ఆయన ఇక్కడ లేడు. ఆయన లేచియున్నాడని ఆ స్త్రీలతో చెప్పారు.

**"వారు భయపడి ముఖములను నేల మోపియుండగా వీరు – సజీవుడైన వానిని మీ రెందుకు మృతులలో వెదకుచున్నారు? ఆయన ఇక్కడలేడు, ఆయన లేచియున్నాడు;"** – లూకా 24:5,6

ఏ సంఘములో అయితే జీవముగల ఆరాధన జరుగుతుందో అక్కడ పునరుత్థానుడైన ప్రభువు ఆత్మరూపిగా సంచరిస్తాడు. జీవముగల ఆరాధనను వదిలి మృతులలో ప్రభువును ఆరాధించలేవు. ఏ జీవము, చలనములేని ఆరాధనలో నీవు వుండలేవు. సజీవుడైన ప్రభువును ఆత్మతో, సత్యముతో ఆరాధించే సంఘములలో ఆయన సంచరిస్తాడు. అక్కడ ఆత్మకార్యములు జరుగుతాయి. ఎందుకంటే ఆయన సజీవుడైయున్నాడు. **'పునరుత్థానమును జీవమును నేనే'** అని ప్రభువు తానే స్వయముగా పలికాడు.

యేసు ప్రభువు – తాను ప్రేమించిన లాజరు రోగిగా ఉన్నాడని తెలియజేసినప్పుడు వెళ్లలేదు, మరణించాడని తెలిసినప్పుడు వెళ్లలేదు, లాజరును సమాధిచేసిన నాలుగురోజుల తరువాత బేతనియకు వెళతాడు. అప్పుడు లాజరు సహోదరియైన మార్త యేసుప్రభువుతో – 'ప్రభువా, నీవిక్కడ ఉండినయెడల నా సహోదరుడు చావకుండును' అంటే ప్రభువు మార్తతో – నీ సహోదరుడు మరల లేస్తాడని చెప్పినప్పుడు మార్త – అంత్యదినమున పునరుత్థానమందు లేస్తాడని నాకు తెలుసు అంటుంది. అప్పుడు ప్రభువు – **పునరుత్థానమును జీవమును నేనే,** నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా? అని ఆమెను అడుగుతాడు. నీవు నమ్మితే దేవుని మహిమను చూతువని చెబుతాడు.

చనిపోయి సమాధి చేయబడిన నాలుగు రోజుల తర్వాత ప్రభువు ఒక్కమాటతో 'లాజరూ, బయటికి రమ్మని' చెప్పగానే లాజరు సజీవుడై సమాధిలోనుండి వెలుపలికి వచ్చాడు. ఆయన పునరుత్థానశక్తి చనిపోయిన వారిని బ్రదికిస్తుంది. **పునరుత్థానమును, జీవమును ఆయనే.** (వాక్యభాగము: యోహాను సువార్త 11వ అధ్యాయము)

నీ కుటుంబములో పాపములతో, అపరాధములతో చచ్చిన వారుంటే నీవు ఈ నామముతో స్తుతించి ప్రార్థించు. అట్టివారిని క్రీస్తుతోకూడ బ్రదికిస్తాడు. కొండలాంటి బండలాంటి హృదయముగల కఠినులుంటే ఆయన పునరుత్థాన బలము వారిని మార్చివేస్తుంది. నీ కుటుంబములో కఠిన సమస్యలుంటే ఈ నామముతో ప్రార్థించు. నీవు భయపడకు. పునరుత్థానము జీవమైయున్న ప్రభువు నీ సమస్యలు తీర్చి విడుదల నిస్తాడు. ప్రతి సమస్యకు జవాబు యేసే. ఆయనే నీ పరిహారి. ఆయన పునరుత్థాన మహిమ ముందు బండ, కావలివారు, ముద్ర నిలువలేకపోయాయి. నీ సమస్యలెంత? విశ్వాసముతో ప్రార్థించు. కొండను పొట్టుగా చేసినట్లు ఆయన నీ సమస్యలను తీరుస్తాడు. భర్త మారుమనస్సుకొరకు, కుమారుల మారుమనస్సుకొరకు ప్రార్థిస్తున్నావా? చచ్చిన లాజరును ఒక్క మాటతో లేపిన ప్రభువు అపరాధములతో పాపములతో చచ్చినవారినికూడ ఒక్కమాటతో లేపగలడు. ప్రభువా, **"పునరుత్థానము, జీవము నేనే"** అని సెలవిచ్చావు. అపరాధములతో, పాపములతో చనిపోయిన నా ఇంటివారిని క్రీస్తుతోకూడ బ్రదికించు తండ్రీ అని ప్రార్థిస్తే తప్పకుండ నీవారందరు రక్షింపబడతారు. పునరుత్థానుడైన యేసు నీకు చాలినవాడు. నీవు ఎదుర్కొనే ఎటువంటి సమస్యనయినా ఆయన పరిష్కరిస్తాడు. దేవునికి స్తోత్రము! హల్లెలూయ! ❀


## దయచేసి గమనించండి

UPF Ph. 040-27624030
27624031, 29704032

"యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్" పరిచర్యలకు మీరు పంపదలచిన విరాళాలను
చెక్ ద్వారా, డి.డి. ద్వారా మరియు ఆన్‌లైన్ బ్యాంకు ద్వారా మాకు పంపగలరు.
**యు.పి.ఎఫ్. ఆఫీసులో స్వైపింగ్ మిషన్ అందుబాటులో ఉంది.**
మీరు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని దేవుని సేవలో తోడ్పడగలరు.
బ్యాంకు మరియు ఖాతా వివరాలు :

**United Peoples Fellowship, Current a/c no. 133911100000946 Andhra Bank, Ramnagar.**
**IFSC Code ANDB0001339** ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ **ANDB0001339**

ఆన్‌లైన్ ద్వారా విరాళము పంపేవారు పంపిన తేది, పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తెలియపరచగలరు.

# దేవుని సహస్రనామములు

గత సంచిక తరువాయి...

## 269. దేవుని కుమారుడు - మార్కు 1:1

"దేవుని కుమారుడైన యేసుక్రీస్తు సువార్త ప్రారంభము." - మార్కు 1:1

ఆయన నూటికి నూరుపాళ్లు దైవకుమారుడు. ఆయన పరమతండ్రి యొక్క అద్వితీయ కుమారుడు. యేసుప్రభువు శిష్యులతో అడుగుతున్నాడు – మీరు నన్నుగూర్చి ఏమనుకుంటున్నారని.

**"అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు - నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు - సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను."** - మత్తయి 16:15-19

ఆయన దైవకుమారుడని విశ్వసించినవారికి గొప్ప భాగ్యము నిచ్చాడు. నీవు –యేసు దేవుని కుమారుడని నమ్మితే ఆయన నీ చేతికి పరలోకరాజ్యపు తాళపుచెవులనిస్తాడు. పేతురు అలాగే పొందాడు. నన్నుగూర్చి నీవేమను కుంటున్నావని పేతురు నడిగినప్పుడు నిజముగా నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పాడు. వెంటనే యేసుప్రభువు నీవు ధన్యుడవు, నీవు బండవు. ఈ బండమీద నా సంఘమును కడతాను. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువలేవంటాడు. దేవుని కుమారుడే ఒకరిని బండ అని పిలిచి ఆ బండమీద తన సంఘమును స్థాపిస్తే ఆ బండమీద కట్టబడిన సంఘమును కూల్చడానికి ఎవరికి సాధ్యము? పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువలేకుంటే నరుడెంత? ఊపిరి వంటివాడు. నీకు పరలోకరాజ్యపు తాళపుచెవులనిచ్చి భూమిమీద దేని బంధిస్తే అది పరలోకములో బంధిస్తాడు. భూమిమీద దేనిని విప్పితే అది పరలోకములో విప్పుతాడు.

సాతాను ప్రభువును శోధించడానికి వచ్చి, నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లను రొట్టెలుగా మార్చుమంటాడు. నీవు దేవుని కుమారుడవైతే పైనుండి క్రిందికి దూకమంటాడు. ప్రభువు సాతానుని ఎదిరించాడు. **"ఆ శోధకుడు ఆయనయొద్దకు వచ్చి - నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను."** - మత్తయి 4:3

**"అంతట అపవాది పరిశుద్ధ పట్టణమునకు ఆయనను తీసికొనిపోయి, దేవాలయ శిఖరమున ఆయనను నిలువబెట్టి - నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము - ఆయన నిన్నుగూర్చి తన దూతల కాజ్ఞాపించును."** - మత్తయి 4:5,6

మనము యేసుప్రభువుని నమ్మితే దేవుని పిల్లలగుటకు అధికార మిస్తాడు. ఎందరు దేవుని ఆత్మచేత నడిపింపబడతారో వారందరు దేవుని కుమారులనబడతారు.

**"తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను."** - యోహాను 1:12

**"దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము - అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము. మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతోకూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతోకూడ మహిమపొందుటకు ఆయనతో శ్రమపడినయెడల, క్రీస్తుతోడి వారసులము."** - రోమా 8:14-17

యేసుప్రభువు దేవుని కుమారుడు. మనమందరముకూడ దేవుని పిల్లలగుటకు ఆయన అధికారమిచ్చాడు. మనకందరికి ఒక్కడే దేవుడు, యేసుప్రభువు తండ్రీ అని పిలుస్తున్నాడు. మనముకూడ తండ్రీ అని పిలుస్తున్నాము. వరుసకు చూస్తే యేసుప్రభువు మనకందరికి జ్యేష్ఠ సోదరుడు, పెద్దన్న అవుతాడు. దైవకుమారుడు మనుష్యకుమారునిగా ఈ లోకమునకు వచ్చి మన మధ్యలో శరీరధారిగా సంచరించాడు. సిలువలో బలి అయ్యాడు. సిలువ మరణముద్వారా తండ్రితో బంధము ఏర్పరచాడు. మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహించాడు. యేసుప్రభువు సహ దైవకుమారునిగా తీర్చబడ్డాడు. అందుకే నాయందు విశ్వాసముంచువారు నాకంటే గొప్ప కార్యములు చేస్తారని చెప్పాడు.

## 270. దావీదు కుమారుడు - మత్తయి 9:27

**"యేసు అక్కడనుండి వెళ్లుచుండగా ఇద్దరు గ్రుడ్డివారు ఆయన వెంట వచ్చి - దావీదు కుమారుడా, మమ్మును కనికరించుమని కేకలువేసిరి."** - మత్తయి 9:27

చాలా మంది రోగులు యేసుప్రభువును దావీదు కుమారుడా అని సంభోదించడము సువార్తలలో చూస్తాము. ఈ వాక్యభాగములోకూడ ఇద్దరు గ్రుడ్డివారు – ప్రభువు ఆ దారి గుండా వెళుతుండడము గమనించి దావీదు కుమారుడా మమ్మును కరుణించుమని కేకలు వేస్తారు.

దావీదు కుమారుడు అనే పేరు ఎందుకు వచ్చిందంటే యేసుప్రభువు యూదా గోత్రములో దావీదు వంశావళిలో పుట్టాడు. దావీదు యెష్షయి కనిష్ఠ పుత్రుడు. దావీదు ఇశ్రాయేలీయులకు రాజుగా అభిషేకింపబడ్డాడు. యూదా గోత్రికుడు, యూదా వంశస్థుడయిన యెష్షయియొక్క కనిష్ఠ పుత్రుడు దావీదు – సమూయేలు ప్రవక్తచేత అభిషేకింపబడినవాడు. ఈ దావీదు వంశములో యేసుప్రభువు జన్మించాడు. పరిశుద్ధ గ్రంథములో దావీదుకు చాలా ప్రాధాన్యత ఉంది. దావీదుకూడ పాపము చేసినవాడే. బత్షెబతో పాపము చేశాడు. ప్రవక్త అయిన నాతాను వచ్చి గద్దించినప్పుడు పాపాన్ని ఒప్పుకున్నాడు. పశ్చాత్తాపపడ్డాడు, ఏడ్చాడు. పాపమును ఒప్పుకొని విడిచిపెట్టి తిరిగి పాపము చేయలేదు. దావీదు దేవునియందు భయభక్తులు కలిగినవాడు. 51వ కీర్తనలో పరిశుద్ధతకొరకు పవిత్రతకొరకు అడుగుతాడు. దావీదు మహా రాజైనను దేవునిపై ఆధారపడేవాడు. ఆయన సన్నిధిని ప్రేమిస్తు దేవునితో సన్నిహితమైన బంధము కలిగినవాడు. ఎల్లప్పుడు దేవుని స్తుతించే స్వభావము కలిగినవాడు. దావీదు అనే పదమునకు ప్రియుడని అర్థము. పేరుకు తగినట్లుగానే దావీదు దేవునికి ప్రియుడయ్యాడు.

**"మరియు ఆయన - నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతనినిగూర్చి సాక్ష్యమిచ్చెను."**

– అపో.కార్య. 13:22

అందుకే దావీదు పేరుతో పరిశుద్ధ గ్రంథములో ఎన్నో విషయములు చూస్తాము. దావీదు పట్టణమందు రక్షకుడు మీకొరకు పుట్టాడని, దావీదు సింహాసనమని, దావీదు తాళపుచెవి కలిగినవాడని, దావీదుకు చూపిన శాశ్వత కృపయని చూస్తాము. ఎందుకు దేవుడు ఒక మనుష్యుని ఇంతగా హెచ్చించి కనికరము చూపాడంటే దావీదులో దేవునికిష్టమైన స్వభావము లున్నాయి. కొన్ని బలహీనతలు వచ్చాయి. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టాడు తిరిగి వాటి తట్టు చూడలేదు. తప్పు మళ్ళీ చేయలేదు. చాలా మందికి తప్పులు చేయడము అలవాటయిపోతుంది. ప్రభువు క్షమిస్తాడని యేసురక్తము మనకు అందుబాటులోనే ఉందనుకుంటారు. కాని మాటి మాటికి ప్రభువును సిలువ వేస్తున్నారనే సంగతి మరచిపోతారు. కానీ దావీదు అలాంటి పని చేయలేదు. పాపము చేశాడు, ఒప్పుకొని విడిచిపెట్టాడు దేవుని కనికరమును పొందాడు. దేవుడినే ఆధారముగా చేసికొని ఎల్లప్పుడు ప్రతి విషయములో దేవుని స్తుతించాడు. ముమ్మారు దేవునికి ప్రార్థనచేసేవాడు. దావీదు దాదాపుగా 71 కీర్తనలు వ్రాశాడు. దావీదు వ్రాసిన ప్రతి కీర్తన స్తుతి ప్రార్థనలతో నిండివుంటాయి. దావీదులో ఎంతో దైవభయము ఉంది. దేవుని ఘనపరచేవారిని ఆయన తప్పకుండ ఘనపరుస్తాడు. దావీదు ఇశ్రాయేలులో గొప్ప రాజైనను దేవుని ఎన్నడు మరువలేదు. దావీదు ఒకప్పుడు గొఱ్ఱెల కాపరి, గొఱ్ఱెల దొడ్డినుండి పిలిచి దేవుడు సింహాసనమధిష్టింపజేశాడు. దేవుడు ప్రవక్తలద్వారా వాగ్దానము చేశాడు. నీ వంశములోనుండి రాజులుదయిస్తారని.

**"అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసుక్రీస్తు వంశావళి."** – మత్తయి 1:1

దావీదుకు దేవుడు అంతటి ఘనతనిచ్చాడు. ఇలాంటి ఘనత దేవునియందు విశ్వసించిన నీకును ఇవ్వగలడు. దావీదులో ఉన్నటువంటి దేవునికి ప్రియమైన స్వభావములు నీలో ఉంటే నీ వంశములోనుండికూడ రాజులుదయిస్తారు. తప్పకుండ అధికారులు, రాజులు, లోకమును తలక్రిందులు చేసేవారు నీ వంశములోనుండి వస్తారు.

దావీదు కుమారుడని యేసుప్రభువు పిలువబడ్డాడు. దావీదుకు ప్రభువు యేసుప్రభువు అయినప్పటికి ప్రవచనములు నెరవేరునట్లు ఆయన దావీదు కుమారుడని పిలువబడ్డాడు.

**"యెష్షయి మొద్దునుండి చిగురు పుట్టును వాని వేరులనుండి అంకురము ఎదిగి ఫలించును."** – యెషయా 11:1

యెష్షయి ఎవరు అంటే దావీదు తండ్రి. దేవుడు అబ్రాహాము కిచ్చిన వాగ్దానము నెరవేర్పు దావీదులో చూస్తున్నాము. దావీదు కిచ్చిన వాగ్దానము నెరవేర్పు యేసుప్రభువులో చూస్తున్నాము.

నీ ద్వారా భూమియొక్క సమస్త వంశములు ఆశీర్వదింపబడుతాయని, దేవుడు అబ్రాహాముకు వాగ్దానము చేశాడు. దావీదు వంశావళిలో యేసు పుట్టడముద్వారా భూమియొక్క వంశములన్నీ ఆశీర్వదింపబడ్డాయి. అందుకే యేసుప్రభువును దావీదు కుమారుడని సంబోధించారు.

## 271. మెస్సీయ

– యోహాను 1:42

**"ఇతడు మొదట తన సహోదరుడైన సీమోనును చూచి - మేము మెస్సీయను కనుగొంటిమని అతనితో చెప్పి యేసునొద్దకు అతని తోడుకొని వచ్చెను. మెస్సీయ అను మాటకు అభిషిక్తుడని అర్థము."**

– యోహాను 1:41,42

శిష్యులు – యేసు ప్రభువు మెస్సీయ అని గుర్తుపడుతున్నారు. సీమోను మెస్సీయను నేను చూశాను నీకు చూపిస్తానని తన సహోదరుని పిలుస్తున్నాడు. అతను వెళ్లి ఇంకొకరిని పిలుస్తున్నాడు. మేము మెస్సీయను కనుగొన్నాము. ఆయన ఎవరో కాదు నజరేయుడైన యేసు అని చెపుతున్నారు. మెస్సీయ అనే పదమునకు అభిషిక్తుడని అర్థము. యూదులను రక్షించడానికి మెస్సీయ అనే ఒకడు పుడతాడని కొన్ని వందల సంవత్సరములక్రితమే ప్రవక్తలు ప్రవచించారు. ఆ ప్రవచనములు ప్రభువు జననముద్వారా నెరవేరాయి. అబ్రాహాము వంశస్థుడయిన మెస్సీయ ఇశ్రాయేలుకు రాజు.

యేసుప్రభువు నేను మెస్సీయనని ప్రధానయాజకులకు రబ్బానీలకు గొప్పవారికి బయలుపరచలేదు. కాని ఒక పాపాత్మురాలయిన సమరయ స్త్రీని చూచి నేనే మెస్సీయనంటాడు. దీనిని బట్టి పాపులను ప్రభువు ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలుస్తుంది.

**"ఆ స్త్రీ ఆయనతో - క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును; ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియజేయునని చెప్పగా యేసు - నీతో మాటలాడుచున్న నేనే ఆయనని ఆమెతో చెప్పెను."**

– యోహాను 4:25-26

ఎంత ఆశ్చర్యము! సమరయ స్త్రీకి దాదాపు ఏడు మర్మములను బయలుపరచాడు. పరిసయ్యులకు శాస్త్రులకు బయలుపరచలేదు కాని ఒక పాపి ప్రభువు తట్టు తిరుగగానే పరమ మర్మములు బోధిస్తున్నాడు. నీవు ఎదురుచూచే మెస్సీయను నేనే అంటున్నాడు. అభిషేకము ఉన్నవారు కాడిని విరుగగొడతారు. అభిషేకింప బడినవారు ఒక గృహములో ప్రవేశించి నప్పుడు ఆ గృహములో ఉన్న చీకటిశక్తులు లయమవుతాయి. వారు రోగిమీద చేతులుంచి ప్రార్థించగానే విడుదల పొందుతారు. అభిషేకింప బడినవారు గొప్ప అభిషిక్తుని నామములో ప్రార్థించినప్పుడు పేదవారు శ్రీమంతులుగా మారిపోతున్నారు. వారికి ఈ అభిషేకము అభిషిక్తుడయిన ప్రభువునుండే వచ్చింది. మెస్సీయ వారిలో ఉన్నాడు కాబట్టే వారు దైవకార్యములు ధైర్యముగా నిరాటంకముగా చేస్తున్నారు. వారి మాటలు నడక జీవిత శైలి శక్తివంతముగా ఉన్నాయి. ఈ అభిషిక్తునికి ప్రార్థించి దైవాభిషేకము పొందాలి. నీవు పొందిన అభిషేకము నీయొద్ద నుండి తొలగిపోకూడదంటే నీవు ఎప్పుడూ దేవుని సంతోషపెట్టాలి. చాలా మంది మనుష్యులను సంతోషపెట్టాలని ఆరాటపడుతుంటారు. వారేమను కుంటున్నారు, వీరేమనుకుంటున్నారోయని ఆలోచిస్తారు. నిన్నుగూర్చి దేవుడేమనుకుంటున్నాడో కనిపెట్టు. నీవు దేవుని సన్నిధిలో నిందారహితుడిగా స్వచ్ఛముగా వుండాలి. నీ క్రియలు ప్రవర్తనద్వారా ఆయనను సంతోషపెట్టాలి. ఎల్లప్పుడు దేవుని చిత్తము జరిగించాలి.

యేసుప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు ఎల్లప్పుడు తండ్రి చిత్తమునే నెరవేర్చాడు. తండ్రి చిత్తము నెరవేర్చడము నాకు ఆహారమంటాడు. నేను తండ్రి చిత్తము నెరవేర్చడానికే ఈ లోకానికి వచ్చానంటాడు. నా చిత్తము కాదు తండ్రీ, నీ చిత్తమే నా జీవితములో జరుగనిమ్మని ప్రార్థిస్తాడు. ఈలాగు తండ్రి చిత్తము నెరవేర్చాలని తపన నీలో ఉంటే దేవుని అభిషేకము పొందుతావు. ఎల్లప్పుడు దేవునినే మహిమపరచాలి. చాలా మంది అభిషిక్తులు తమ అభిషేకము కోల్పోయి శక్తిహీనముగా అయిపోతారు. ఎందుకంటే సొంత ఘనతను కోరుకుంటారు. మనుష్యుల ప్రశంసలు కోరుకుంటారు. స్థానమానములు ఆశిస్తారు. అందుకే అభిషేకము వారిని వదిలిపోతుంది. యేసుప్రభువు ఎంతగా తగ్గించుకున్నాడంటే శిష్యుల పాదాలు కడిగాడు. ఆయన తన జీవితముద్వారా దేవుని ఘనపరచాలని కోరుతున్నాడు. దేవుని నామమును గొప్ప చేస్తే అభిషేకము నీపైకి వస్తుంది. మెస్సీయ నీ

గృహములో వుంటాడు. ఆయన సన్నిధి అనుభవిస్తావు. ఆయన నీ మధ్యలో సంచరిస్తాడు. ఆయన శక్తి వ్యాపిస్తుంది.

మెస్సీయకు ఇష్టములేని పనులు ఎప్పుడూ చేయకూడదు. మనుష్యుల మెప్పు మనుష్యులకిష్టమైన పనులు చేస్తు దేవునికి అయిష్టమైన పనులు చేయకుండ నిన్ను నీవు పరీక్షించుకో. ఈ మధ్యలో అన్యులనుండి ఒక సహోదరి ప్రభువును నమ్ముకొని బాప్తిస్మము తీసికుంది. కుమారుడి వివాహ సమయములో ప్రభువు బిడ్డనని మరచి అన్యుల సంప్రదాయ ప్రకారము వివాహము జరిగించింది. ఇది తెలిసి నాకు చాలా బాధనిపించింది. గొప్ప అభిషిక్తుని నీలో కలిగియుండి మనుష్యుల ఇచ్ఛకు తలవంచుతావా? నీ జ్ఞానము ఎక్కడ? రెండు తలంపుల మధ్య తడబడకూడదు. ద్విమనస్కులను యెహోవా ద్వేషిస్తాడు. ఉంటే చల్లగా వుండు, లేకుంటే వెచ్చగా ఉండు. ఉంటే క్రీస్తులో వేరుపారి స్థిరముగా ఉండు లేకుంటే అన్యుల సంప్రదాయ ప్రకారము వుండు. నులివెచ్చనగా వుండి రెండు తలంపుల మధ్య తడబడుతు అటు మనుష్యులను సంతోషపెట్టాలని ఇటు దేవుని సంతోషపెట్టాలని ప్రయత్నించి ఎటుకాకుండా అయిపోకు. జాగ్రత్త! దేవుడు తన నోటినుండి ఉమ్మివేసే దౌర్భాగ్యము రానీయకు. నీ జీవితముద్వారా మెస్సీయ ఘనపరచబడాలి. నీవు ఆయన కిష్టమైన పనులు జరిగిస్తే నీకు ధైర్యము వస్తుంది. ధైర్యముతో దేవుని కృపాసనము సమీపిస్తావు. ప్రార్థనలకు జవాబు పొందుతావు. లేకుంటే నామముల పుస్తకము పట్టుకొని నీవు ఎంత ప్రార్థించినా, నీ మోకాళ్లు అరుగగొట్టుకున్నా మెస్సీయ దిగిరాడు. నీ ప్రార్థనలకు జవాబు రాదు. ఆయన కిష్టమైన పనులు చేస్తు ఆయన చిత్తము జరిగించినప్పుడు మెస్సీయ నిన్ను అభిషేకిస్తాడు. నీకు పరమ మర్మములు బోధిస్తాడు.

## 272. రబ్బీ

– యోహాను 1:38

**"యేసు వెనుకకు తిరిగి, వారు తన్ను వెంబడించుట చూచి -మీరేమి వెదకుచున్నారని వారినడుగగా వారు - రబ్బీ, నీవు ఎక్కడ కాపురమున్నావని ఆయనను అడిగిరి. రబ్బి యను మాటకు బోధకుడని అర్థము."**
– యోహాను 1:38

రబ్బీ అనే పదమునకు బోధకుడని అర్థము. అది ఆయన నామము. ప్రపంచములో ఎవరికీ లేని ధన్యత దేవుడు నాకిచ్చాడు. 4 సంవత్సరములు వెయ్యి నామములు బోధించడానికి ఆయన తన కృపను నాకిచ్చాడు. నాలుగు సంవత్సరములు ఒకే అంశముపై నిరాటంకముగా బోధించాలంటే దైవ జ్ఞానము, దైవ శక్తి, దేవుని అభిషేకము కావాలి. మెస్సీయ నీలో ఉండాలి. ఆయనే నాకు పరమ బోధకుడయ్యాడు. రబ్బీ అను మాటకు నా బోధకుడా అని కూడ అర్థము.

**"యేసు ఆమెను చూచి - మరియా అని పిలిచెను. ఆమె ఆయనవైపు తిరిగి ఆయనను హెబ్రీ భాషతో రబ్బూనీ అని పిలిచెను. ఆ మాటకు బోధకుడని అర్థము."** – యోహాను 20:16

మగ్దలేనే మరియ ప్రభువు మృతదేహమునకు సుగంధద్రవ్యములు పూయాలని ప్రభువు దేహముకొరకు సమాధితోటకు వచ్చింది. అక్కడ సమాధిలో ప్రభువు మృతదేహము కనబడనందున ప్రభువును ఎవరో ఎత్తికొనిపోయారని ఏడుస్తుంది. అప్పుడు పునరుత్థానుడైన ప్రభువు మగ్దలేనే మరియకు దర్శనమిచ్చి మరియా అని పేరు పెట్టి పిలుస్తున్నాడు. మరియ ప్రభువు స్వరమును గుర్తించి "రబ్బూనీ" అని పిలుస్తుంది. అంతవరకు యేసుప్రభువును చూచి తోటమాలి అనుకుంది. ప్రభువును ఎంతగానో ప్రేమించింది కనుక ప్రభువు స్వరము ఆమెకు బాగా తెలిసినందున ప్రభువు స్వరము వినగానే గుర్తించింది. రబ్బూనీ అని పిలుస్తుంది.

యేసుప్రభువు శాస్త్రులను పరిసయ్యులను సంబోధిస్తూ ఇలాగంటాడు.

**"సంత వీధులలో వందనములను మనుష్యులచేత బోధకులని పిలువబడుటయు కోరుదురు. మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు."** – మత్తయి 23:7,8

ఇది చదివి చాలాసేపు ఆలోచించాను. ఏంటి ప్రభువా, ఇప్పటివరకు నేను బోధకురాలినని అనుకుంటున్నాను. ఇప్పుడింత ఖచ్చితముగా మాట్లాడుతున్నావు. నేనొక్కడినే బోధకుడనని, మరిమేమంతా ఎవర మన్నప్పుడు మీరు నా సేవకులు, సహోదరులంతే అన్నాడు. మేము బోధించే బోధ బోధకుని దగ్గరనుండి పొందినదే. బోధకుడు ఒక్కడే. ఆయన పాదముల దగ్గర సేవకులు కూర్చున్నప్పుడు బోధకుడు తన బోధలతో నింపి ప్రజల ముందు నిలుపుతున్నాడు. దేవునికి స్తోత్రం! బోధకుడు ఎవరికి బోధిస్తాడు? ఆయన తన జ్ఞానము ఎవరికి ఇస్తాడు? ఆయన తలంపులు ఆలోచనలు ఎవరికి బయలుపరుస్తాడంటే నీతికొరకు ఆకలిదప్పులు కలిగినవారికి. అట్టివారు తృప్తిపరచబడతారు. దైవభయములేని ధన వంతులను గర్విష్ఠులను వట్టి చేతులలో పంపుతాడు.

**"ఆకలిగొనినవారిని మంచి పదార్థములతో సంతృప్తిపరచి ధనవంతులను వట్టి చేతులతో పంపివేసెను."** – లూకా 1:53

**"ఆ సమయమున యేసు చెప్పినదేమనగా - తండ్రీ, ఆకాశమునకును భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను."**
– మత్తయి 11:25

జ్ఞానులకు వివేకులకు మరుగుచేసి పసిబాలురకు బయలు పరుస్తానని అంటున్నాడు. పసిబిడ్డలాంటి హృదయము నీకుండాలి. యథార్థముగా ప్రవర్తించాలి. ఆయన సన్నిధిలో నిష్కపటముగా వుండాలి. జ్ఞానులను, ధనవంతులను వట్టి చేతులతో పంపివేసి పసిబిడ్డలాంటి హృదయము కలిగి, నీతికొరకు ఆకలిదప్పులు గలవారిని తన బోధలతో తృప్తిపరుస్తాడు.

చాలా మంది దేవుని సేవ చేయడానికి, ఆయన వాక్య పరిచర్య చేయడానికి ఏవేవో డిగ్రీలుండాలని అంటుంటారు. బి.టిహెచ్., యం.టిహెచ్., బి.డి., డి.డి., డిగ్రీలుండి... డాక్టరేట్‌లు, రెవరెండ్‌లై యుండాలని అనుకుంటారు. నన్నడిగితే ఇవేవి అవసరము లేదు. పరమ బోధకుని పాదముల దగ్గర కూర్చో. ఆయనే నీ బోధకుడై తన బోధలన్నీ నీకనుగ్రహిస్తాడు. నీవు వాక్యమందించాలంటే, ధర్మశాస్త్రములోని పరిశుద్ధ గ్రంథములోని మర్మములు గ్రహించాలంటే బోధకుడా అను నామముతో ప్రార్థించు. చాలా మంది నన్నుదుగుతారు మీరే బైబిల్ కాలేజిలో ట్రైనింగ్ అయ్యారని. అట్టివారితో చెపుతాను – యేసు పాదములే నా బైబిల్ కాలేజి యేసే నా బోధకుడని. లోకరీతిగా మూడు యం.ఏ. డిగ్రీలు చేశాను గాని పరిశుద్ధ గ్రంథములోని మర్మములు, ఆత్మీయ సత్యములు ప్రభువే నాకు బోధించాడు.

పేతురు – బెస్తవాడు, చేపలు పట్టేవాడు. పేతురు ఏ బైబిల్ కాలేజిలో చదువుకోలేదు. కాని పరిశుద్ధాత్మతో నింపబడి ఒక్క ప్రసంగము చేస్తే 5 వేల ఆత్మలు రక్షింపబడ్డారు. యేసుప్రభువు తన బోధలతో నింపాడు. నీవు సేవ చేయాలి, వాక్యము ప్రకటించాలంటే బోధకునికి మొఱ్ఱపెట్టు. బోధకుడా, నాకు పరలోక జ్ఞానము దయచేయి. నన్ను నీ బోధలతో నింపుమని ప్రార్థించు. తప్పకుండ ఆయన నీకు ఉపదేశిస్తాడు. ❀

# దేవుని వెయ్యి వాగ్దానములు

గత సంచిక తరువాయి...

## 112. నిన్ను శాశ్వత శోభాతిశయముగాను బహు తరములకు సంతోషకారణముగాను చేసెదను.

- యెషయా 60:15

ఇది దేవునియొక్క గొప్ప వాగ్దానము. ఆయన నిన్ను శాశ్వత శోభాతిశయముగా, బహుతరములకు సంతోషకారణముగా చేయగలడు. **"సర్వశక్తిమంతుడు నాకు గొప్పకార్యములు చేసెను గనుక ఇది మొదలుకొని అన్నితరములవారును నన్ను ధన్యురాలని యందురు."** - లూకా 1:49 ఈ వాగ్దానము ప్రకారము అన్నితరములవారు నేటికి మరియను ధన్యురాలని, హోలీమేరీ, బ్లెస్డ్ మేరి అని అంటున్నారు. మరియ దేవుని చిత్తమును నెరవేర్చి ఎంతటి ఘనతను పొందింది! ఆమె బహు తరములకు సంతోషకారణం అయ్యింది. కొందరు ఆమెను పూజిస్తున్నారు గాని పూజార్హుడు యేసు ప్రభువు ఒక్కడే. మరియ ఔన్నత్యానికి రహస్యము ఆమె సంపూర్ణంగా దైవచిత్తానికి లోబడటము. దేవుడు ఏమి చెప్పాడో ఆలాగు చేసింది. **"అందుకు మరియ-ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను."** - లూకా 1:38. దేవుడు చెప్పిన ఏ మాట నిరర్థకము కాదని నమ్మింది. దేవునివలన కృప పొందింది. సర్వోన్నతుని శక్తి ఆమెను కమ్ముకొంది. పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడునని దూత చెప్పాడు. అవును, ఆయన చిత్తాన్ని నెరవేర్చే ప్రతి ఒక్కరిని బహు తరములకు సంతోషకారణంగా చేయాలనే ఉన్నతమైన తలంపు కలిగి ఉంటే కొందరు స్వంత బుద్ధితో మేము భార్యా భర్తలము ఇద్దరము తృప్తిగా తిని హాయిగా ఉంటే చాలు, ఏదో పొట్టకూటికొరకు చిన్న ఉద్యోగము ఉంటే చాలు అనుకొంటారు. నేను ఒక సహోదరితో మాటిమాటికి 'దేవుడు నిన్ను తన సేవలో వాడుకోబోతున్నాడు' అంటే ఆమె - నేను చాలా చదువుకొన్నాను, ఇంకా ఒక ఉద్యోగంకూడా రాలేదు అంటుంది. దేవుడు నిన్ను బహు తరములకు సంతోషకరంగా వాడుకొంటాడంటే ఆమె ఇంతవరకు ఆ మాట నమ్మలేదు. ఇంకా అనేక ప్రయత్నాలు చేస్తూనే ఉంది. చివరికి అన్ని ప్రయత్నాలు విఫలమై తిరిగి దేవుని సేవ చేస్తుంది. దేవుని మాట, దేవుని సన్నిధిలో నిలిచి దైవజనులు చెప్పిన దేవుని మాటలు నిరర్థకము కావు, మరొక సహోదరితో మీ పద్ధతి ఏమిటి? సేవ చేయరు? గుడికి రారు; ఎప్పుడూ నెమ్మదిగా చక్కగా కారులో తిరుగుతూ హాయిగా ఉంటారు; మీ గురి ఏమిటి? అంటే ఏమీ లేదు; మేము ఇలాగే నెమ్మదితో హాయిగా ఉంటాము అన్నా మరి దేవునికొరకు ఫలించాలి గదా! ఫలించని చెట్టును దేవుడు కొట్టివేస్తాడు గదా అంటే ఏమీ జవాబివ్వలేదు గాని భయపడింది. మనమట్టుకు మనము బ్రతకడము కాదు; బహు తరములకు సంతోష కారణంగా ఉండాలి.

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ సంఘము బహు తరములకు సంతోష కారణం అయ్యింది. మనము ఈ లోకమునుండి దాటిపోయినా మనము దేవునికొరకు చేసిన ప్రయత్నాలు వృధా కావు. నేను వ్రాసిన **"దేవుని వెయ్యి నామములు"**, **"దేవుని వెయ్యి వాగ్దానములు"** మొదలైన పుస్తకములు లోకానికి విడుదల చేశాను. అనేక వర్తమానములు చేశాను. ఆ ప్రయత్నాలు తప్పక అనేకులకు దీవెనకరము, సంతోషకరము అవుతాయి. నీవేమీ బాధపడే అవసరము లేదు, కలత చెందే అవసరము లేదు. దేవుడు నిన్ను శాశ్వత శోభాతిశయంగా, బహు తరములకు సంతోషకారణంగా చేస్తానని చెబితే తప్పక చేస్తాడు. ఇది దేవుడు నాకు సేవారంభములో ఇచ్చిన వాగ్దానము. నేను విశ్వాసముద్వారా ఈ వాగ్దానమును పొందాను. దేవుడు నాకు ఈ వాగ్దానము ఇచ్చినప్పుడు నాకు ప్రసంగించడమే రాదు. కాని నేను తెలివితో దేవుడిచ్చిన మాటలు ఎప్పుడు నిరర్థకము కావని నమ్మి ప్రార్థిస్తూ వచ్చాను. వాగ్దాన నెరవేర్పుకొరకు కొంత కాలము కనిపెట్టాల్సి వచ్చింది. రానున్న తరాలకు ఆశీర్వాదకరముగా సంతోషకారణముగా చేస్తానన్న దేవుడు నన్ను అనేకులకు ఆశీర్వాదకరముగా మార్చాడు. ఈనాడు దేవుడు దాన్ని నెరవేర్చాడు. ఎన్ని ఆటంకములు వచ్చినా దేవుడు నన్ను నిలబెట్టి వాడుకొన్నాడు. దేవుడు నిలబెట్టిన వ్యక్తిని ఎవరూ అణచివేయలేరు. దేవుడు తన వాగ్దానమును తప్పక నెరవేరుస్తాడు.

ఈ వాగ్దానము నీయెడల నెరవేరాలంటే నీవు ఏమీ పట్టనట్టు ఉండక లేచి దేవునికొరకు నిలబడాలి. **"నీకు వెలుగు వచ్చియున్నది, లెమ్ము, తేజరిల్లుము యెహోవా మహిమ నీమీద ఉదయించెను."** - యెషయా 60:1 పొదుగుతున్న కోడిలాగా ఎక్కడ కూర్చున్నావో అక్కడే ఉంటే తేజస్సు నీకు ఎలా వస్తుంది. నీవు లేవాలి; యథార్థముగా నీతితో ఆయన ఇచ్చే మహిమతో శక్తితో లేవాలి. యేసు ప్రభువుకొరకు ప్రకాశించాలి. నిద్రిస్తున్న నీవు మేల్కోవాలి. అప్పుడు క్రీస్తు నీమీద ప్రకాశిస్తాడు. ఆయన నిన్ను శాశ్వత శోభాతిశయంగా బహు తరములకు సంతోషకారణముగా చేస్తాడు.

## 113. మీరు భయపడకుడి, జడియకుడి, యీ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును.

- 2 దినవృ. 20:15

**"యూదావారలారా, యెరూషలేము కాపురస్థులారా, యెహోషాపాతు రాజా, మీరందరును ఆలకించుడి; యెహోవా సెలవిచ్చున దేమనగా - ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, యీ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును!'**

- 2 దినవృ. 20:15

మీరు భయపడవద్దు, శత్రుసైన్యమును చూసి జడియవద్దు. ఎందుకంటే యీ యుద్ధము మీరు కాదు, దేవుడే జరిగించునని ప్రవక్త యూదావారితో చెబుతున్నాడు. చిన్నరాజైన యెహోషాపాతుమీదికి ఆరుగురు గొప్ప శత్రు రాజులు యుద్ధానికి వస్తారు. అయితే యెహోషాపాతు రాజు తన బలము, శక్తిమీద ఆధారపడక ఓ మంచి పనిచేశాడు. దేవుడైన యెహోవాను నమ్ముకొన్నాడు. **"వారు పోవుచుండగా యెహోషాపాతు నిలువబడి - యూదావారలారా, యెరూషలేము కాపురస్థులారా, నా మాట వినుడి; మీ దేవుడైన యెహోవాను నమ్ముకొనుడి, అప్పుడు మీరు స్థిరపరచ బడుదురు; ఆయన ప్రవక్తలను నమ్ముకొనుడి, అప్పుడు మీరు కృతార్థులగుదురని చెప్పెను."** - 2 దినవృ. 20:20. యెహోషాపాతు రాజు తన సైన్యముతో - గొప్పరాజులు మనమీదికి వస్తున్నారు కాని మనకు భయము లేదు అని చెబుతున్నాడు. జడియవద్దు, భయపడవద్దు, ఈ యుద్ధము దేవుడే జరిగిస్తాడు అని ప్రవక్త చెప్పిన మాట నమ్మారు. దేవుని,

దేవుని ప్రవక్తలను నమ్మారు. రాజు సైన్యాన్ని చూచి, మీరు భయపడే అవసరము లేదు; దేవుడైన యెహోవాను నమ్ముకోండి అప్పుడు మీరు స్థిరపరచబడుతారు. ఆయన ప్రవక్తలను నమ్ముకోండి అప్పుడు మీరు కృతార్థులవుతారని చెప్పాడు.

**"మరియు అతడు జనులను హెచ్చరిక చేసిన తరువాత యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడచుచు - యెహోవా కృప నిరంతరముండును, ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను."** - 2 దినవృ. 20:21. ఇదెక్కడి యుద్ధము? యుద్ధానికి వచ్చేవారిని సంగీతముతో జయిస్తారు. చిన్న రాజు, చిన్న సైన్యము, కత్తులు కటార్లు వాడకుండా యుద్ధాన్ని ఎలా ఎదుర్కొనాలి? ఖడ్గాలు, యుద్ధ బలం, రౌతుబలం వారికి అంతగా లేదు. అయితే రాజు గాయకులను ఏర్పరచాడు; వారు పరిశుద్ధాలంకారములు ధరించుకొని సైన్యమునకు ముందు నడుస్తూ 'యెహోవా కృప నిరంతరముండును' అని పాటలు పాడుతూ యుద్ధానికి వెళ్లారు. ఈనాడు కూడ దేవుని నామములు, దేవుని వాగ్దానములు ధ్యానించి స్తుతిస్తున్న మనకు ఆయన కృప తోడుగా ఉంటుంది. నేను అనేకమార్లు ఆకాశము తట్టు చూచి ప్రార్థిస్తాను. దేవుడు అనంతమైన తన కృపతో మనల్ని కాపాడుతున్నాడు. ఆ కృపకు అవధులు లేవు. ఒక్కసారి నీ తల పైకెత్తి ఆకాశము తట్టు చూడు. దేవుని అనంతమైన కృపయందు ఆనందిస్తావు. యెహోవాయందు భయభక్తులుగలవారికి భూమికి ఆకాశము ఎంత ఉన్నతముగా ఉందో ఆయనకు ప్రార్థించే వారి పట్ల ఆయన కృప అంతగా ఉంటుంది. యూదావారు ఆ విధంగా యుద్ధము ఎదుర్కొన్నప్పుడు గొప్ప అద్భుతము జరిగింది. ఆరుగురు శత్రురాజులు, సైన్యము ఏకమై యెహోషాపాతు సైన్యముమీదికి వచ్చారు గాని వాళ్లలో వారికే గొప్ప యుద్ధము చెలరేగి శత్రువులందరూ ఒక్కరు మిగులకుండా హతులయ్యారు. ఒకర్ని ఒకరు చంపుకొన్నారు. **"అమ్మోనీయులును మోయాబీయులును శేయీరు మన్యనివాసులను బొత్తిగా చంపి నిర్మూలము చేయవలెనని పొంచియుండి వారిమీద పడిరి; వారు శేయీరు కాపురస్థులను కడముట్టించిన తరువాత తమలో ఒకరినొకరు చంపుకొనుటకు మొదలు పెట్టిరి."** - 2 దినవృ. 20:23

పాటలు పాడి స్తుతించి ఆరాధించినప్పుడు శత్రువులు తమలోనే ఒకరినొకరు చంపుకొనుటకు ప్రారంభించారు. మీకు ఒక చిన్న చిట్కా చెబుతాను. యెహోషాపాతురాజు మీదికి దాదాపు ఆరుగురు శత్రుసైన్యము వచ్చింది. మనమీదికి యుద్ధానికి రాజులెవ్వరు రారుగాని సమస్యలే మనపైకి శత్రుసైన్యంగా వస్తాయి. ఒక ప్రక్కనుండి ఆర్థిక ఇబ్బందులు, రోగముతో ఆరోగ్యం క్షీణించడం, మరో ప్రక్కనుండి భర్త దారితప్పడం లేదా భార్య ఇల్లువదలి వెళ్లడం, పిల్లలు మాటవినకపోవడం... ఒకేసారి అన్నీ ఒక్కుమ్మడిగా రాగానే నీవు దేవుని స్తుతించాలి. అప్పుడు అన్నీ లయమై నీ సమస్య తీరిపోతుంది. ప్రార్థించి దేవుని నమ్మాలి, ఆయన సేవకుల మాట నమ్మాలి. ఆయన మాటలు గతించనటువంటివి. దేవుని, దేవుని సేవకులను నమ్మితే మీరు కృతార్థులౌతారు, దీవింపబడుతారు. దేవుడు మీ పక్షముగా యుద్ధము చేస్తాడు. మీకు జయము అనుగ్రహిస్తాడు.

నా సేవా జీవితములో దేవుడు ఒకసారి ఇటువంటి యుద్ధమే నా పక్షంగా జరిగించాడు. ఒక స్త్రీగా సేవలో బలంగా నిలబడాలంటే, సంఘాన్ని నడిపించే కాపరిగా నాయకురాలిగా ఉండాలంటే అనేక సమస్యలు, సవాళ్లు ఉంటాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఇలాంటి సందర్భమే నాకు ఎదురైంది. అప్పుడు దేవుని సన్నిధిలో మోకరించి ప్రార్థిస్తుంటే.. బిడ్డా, నీమీదకు వచ్చే శత్రువులు ఒక్కుమ్మడిగా నీమీదకు వచ్చి పోయేటప్పుడు ఏడు దార్లలో వెళ్తారని చెప్పాడు. ఈ వాక్యం బైబిల్‌లో చూసి చాలా ఆనందించాను. **"నీమీదపడు నీ శత్రువులను యెహోవా నీ యెదుట హతమగునట్లు చేయును, వారొక త్రోవను నీమీదికి బయలుదేరి వచ్చి యేడు త్రోవల నీ యెదుట నుండి పారిపోవుదురు."** - ద్వితీ.కాం 28:7. దేవుడు నా పక్షంగా ఈ యుద్ధము జరిగిస్తాడని నమ్మి ఆ వాగ్దానాన్ని పొందాను. శత్రువులు ఒక్క త్రోవలో ఐక్యంగా వచ్చి వెళ్లేటప్పుడు ఎందుకు 7 త్రోవల్లో వెళ్తారు? అంటే వాళ్లలో వాళ్లకు పడకుండా వేరౌతారు. గనుక ఒక్కొక్కరు ఒక్కోదారి ఎంచుకొని తిరిగి వెళ్తారు. దేవుడు ఎంత గొప్పవాడు. వాళ్లు ఒక్క మనస్సుతో సైన్యంగా వస్తారు. ఒకసారి నాయొద్దకు అలానే వచ్చారు. నేను ఒక్కదాన్నే మందిరములో సంపూర్ణ రాత్రి ప్రార్థన చేశాను. మందిరము మూసి మోకరించి ఒంటరిగా ప్రార్థిస్తున్నాను. దేవుడు - నీవు ప్రార్థించే అవసరము లేదు; నీ యుద్ధము నేనే జరిగించి గెలుపు ఇస్తాను అన్నాడు. నేను ఆ రాత్రంతా పాటల పుస్తకములో ఉన్న పాటలన్నీ పాడి దేవుని స్తుతించాను. ఉదయాన్నే దేవుడు గొప్ప జయం ఇచ్చాడు. ఏడుగురు వ్యక్తులు వస్తానని ఒక్కరూ రాలేదు. వస్తానని చెప్పిన ఏడుగురు ఏడు దారుల్లో వెళ్లిపోయారు. అక్కడ ఎవరు లేరు. దేవుడు యెహోషువతో నీవు బ్రతుకు దినములన్నిటను ఏ మనుష్యుడు నీ యెదుట నిలువలేడు అని చెప్పాడు. అది నా పట్ల అలాగు నెరవేరింది. దేవుని వాగ్దానములు ఎన్ని ఉన్నా అవన్నీ యేసుక్రీస్తునందు నిశ్చయములై యున్నవి. కావున నీవు భయపడవద్దు, జడియవద్దు; నీవు కాదు దేవుడే ఆ యుద్ధాన్ని జరిగిస్తాడు.

ఒకసారి ఒక యౌవనస్థుని వాని తల్లిదండ్రులు నా వద్దకు ప్రార్థనకు తెచ్చారు. పోలీస్‌వాళ్లు మా కుమారుని చాలా సతాయిస్తున్నారు. ప్రతిరోజు ఇంటికి వచ్చిపోతున్నారు. స్టేషన్‌కు రమ్మంటున్నారు. వాడు చెయ్యని నేరములో వానిని ఇరికించారు అని చెప్పారు. నేను దేవా, ఈ యుద్ధము నీది, ఇంకొకసారి ఇది నా చెవులకు వినబడకూడదు. ఈ బిడ్డను కాపాడు, నీ దూతలను పంపి సహాయము చేయుము అని ప్రార్థించి పంపాను. రెండు నెలల తర్వాత అడిగితే - అమ్మా, వారి పత్తా, జాడ లేదు. దేవుడు ఆ సమస్యనుండి మా కుమారుని విడిపించాడని చెప్పారు. దేవునికి స్తోత్రములు. ఈ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగిస్తాడు గనుక నీవు భయపడవద్దు, జడియవద్దు. ❀

## దెబోరా స్వరం చందాదారులకు గమనిక

**దెబోరా స్వరం ద్విమాస పత్రిక చందా వివరములు**

**పత్రిక చందా సంవత్సరానికి రూ॥ 100/- మాత్రమే**

మీ చందాను నవీకరించారా? (రెన్యువెల్ చేశారా?)

ఈ పత్రికను గురించి మీ బంధువులకు, తెలిసినవారికి పరిచయము చేయండి. వారి పూర్తి అడ్రస్ మాకు పంపించగలరు.
మీరు పంపవలసిన మా చిరునామా :

**జాయ్ చెరియన్**
**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్)**
**1-9-52/ఇ/3, రాంనగర్, హైదరాబాద్ -500 020.**
**ఫోన్ : 040-27624030**

## యు.పి.ఎఫ్. సమాచారం

# 40 రోజుల సిలువ ధ్యానములు

19.02.2018 నుండి 30.03.2018 వరకు 40 రోజుల సిలువ ధ్యానములు ప్రతి రోజు ఉ॥ 4 గంటల నుండి ఉ॥ 7 గంటల వరకు సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్‌నందు ఎంతో జయకరముగా జరిగినవి.

రెవ. డా. జాయ్ చెరియన్ గారు **"వేరు ప్రియునికన్న నీ ప్రియుని విశేషమేమి?"** – పరమగీతము 5:9 కేంద్ర అంశముగా పరమగీతము 8 అధ్యాయములు ప్రతి ఉదయము బోధించారు. పిమ్మట దేశ, విదేశాలు, రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన దైవసేవకులు సిలువ వర్తమానములు అందించారు.

రాంనగర్ నుండి సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్‌వరకు 2 బస్సులు ఏర్పాటు చేయబడినవి.

ఈ కార్యక్రమము ప్రతి రోజు గాస్పల్ టి.వి.లోను, ఆన్‌లైన్‌లోను ప్రత్యక్ష ప్రసారము చేయబడినది.

యు.పి.ఎఫ్. పాస్టర్స్, యు.పి.ఎఫ్. క్వయర్, సి.బి.సి. యూత్ క్వయర్ పాలుపొందారు.

**7 గంటల స్తుతి ప్రార్థనలు:** 18.03.2018 నుండి 25.03.2018 వరకు ప్రతిరోజు మ॥ 2 గంటల నుండి రా॥ 9 గంటల వరకు యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో దేవుని వెయ్యి నామముల స్తుతి, దేశ భద్రతకొరకు ప్రార్థనలు జరిగినవి.

21.03.2018న యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురములో ఉ॥ 10 గంటలకు పరమగీతము 5:10-16 వచనముల కంఠత పోటీ పెద్ద ఎత్తున జరిగింది. పిల్లలు, పెద్దలు, వృద్ధులు పాల్గొన్నారు. పోటిలో గెలుపొందిన ఒకరికి (విజేతకు) 10,000/- రూపాయల బహుమతి ప్రకటించారు.

26.03.2018న యు.పి.ఎఫ్. మందిరములో దేవుని వెయ్యినామముల స్తుతి ఆరంభించబడి ప్రతి రోజు జయకరముగా జరుగుచున్నది.

ఈ 40 రోజుల సిలువధ్యానాల్లో 28.02.2018 మరియు 28.03.2018న రెండు **''సంపూర్ణ రాత్రి ప్రార్థనలు''** కూడా నిరంతరాయంగా కొనసాగినవి. ఎంతో జయకరంగా జరిగినవి.

29.03.2018న అమ్మగారు పరమగీతం 8 అధ్యాయల ధ్యానము జయకరంగా ముగించారు.

**శుభ శుక్రవారము:** 30.03.2018న ఉ॥ 4 గంటల నుండి 7 గంటల వరకు సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్‌లో శుభ శుక్రవార ఆరాధన కార్యక్రమము ఎంతో జయకరంగా జరిగింది. అమ్మగారు ఆత్మనడిపింపుద్వారా సుదీర్ఘ ప్రార్థన (దాదాపు గంట సేపు)లో అనేక అంశములకొరకు ప్రార్థించి సిలువ ధ్యానముల్లో పాలుపొందినవారిని, లైవ్ టెలికాస్ట్ వీక్షించిన ప్రపంచ నలుమూలల్లో ఉన్న విశ్వాసులను ఆశీర్వదించారు. పాస్టర్ చార్లెస్ థియోడర్ గారు వాక్య పరిచర్య చేశారు.

ఉ॥ 6 గం॥లనుండి 10.30 నిమిషాల వరకు యు.పి.ఎఫ్. ఆలయంలో యు.పి.ఎఫ్. పాస్టర్లు, సిస్టర్ రూత్ జెర్మియా గార్లు యేసు ప్రభువు సిలువలో మాట్లాడిన 7 మాటలు బోధించారు. అమ్మగారు 7 మాటలు మరియు **"యెరూషలేము కుమార్తెలారా.. మీ పిల్లల నిమిత్తము ఏడ్వుడి"** – లూకా 23:28 అనే మాటయొక్క సంక్షిప్త వివరణ తెలియజేసి శుభ శుక్రవార శుభములు, ఆశీస్సులు పలికారు.

యు.పి.ఎఫ్. ఆలయంలో సా॥ 5 గంటల నుండి రా॥ 9 గంటల వరకు శుభ శుక్రవార సాయంకాల ఆరాధన జయకరంగా జరిగింది. యు.పి.ఎఫ్. పాస్టర్లు పస్కా లేఖనములు నెరవేరునట్లు ప్రభువు మరణించుట అనే అంశముపై వాక్య పరిచర్య చేశారు.

31.03.2018న యు.పి.ఎఫ్. కృతజ్ఞతాకూడిక సి.బి.సి. సికింద్రాబాద్‌లో ఎంతో ఘనంగా, జయకరముగా జరిగింది. అమ్మగారు **"దేవుడు గొప్పవాడు"** అని సంఘమునకు 7 వాగ్దానములు తెలియజేశారు. ప్రముఖులు రెవ. టి.యం. కుమార్, శ్రీమతి క్రిష్టిన లాజరస్, పాస్టర్ కృష్ణ ప్రసాద్, పాస్టర్ సెబాస్టియన్, రెవ. జి. జోసెఫ్, యు.పి.ఎఫ్. పాస్టర్స్, సహో. ఎ.యం. జాకబ్, సహో. జోసి, (అమ్మగారి అల్లుడు), పాస్టర్ చార్లెస్ థియోడర్ (సి.బి.సి) గార్లు పాల్గొన్నారు. శ్రీమతి క్రిష్టిన లాజరస్ గారు పరమగీతం 5:10-16 కంఠత పోటీలో పాల్గొని విజేతగా నిలిచిన మాస్టర్ అఖిల్‌కు బహుమతి అందజేశారు. గాస్పెల్ టి.వి. నుండి సిస్టర్ సింఫని సామ్, షాలోమ్ ఓల్డ్ ఏజ్ హోం మెంబర్స్ అమ్మగారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. మరియు 6 ఐటమ్స్‌తో కూడిన ఘనమైన అల్పాహారం ఏర్పాటు చేయబడింది.

**బాప్తిస్మ కార్యక్రమము:** 31.03.2018 శనివారము సా॥ 4 గంటలు యు.పి.ఎఫ్. ఆలయంలో బాప్తిస్మ కార్యక్రమము జయకరంగా జరిగింది. 19 మంది బాప్తిస్మములు తీసికొని ప్రభుబల్లలో పాలుపొందారు. అమ్మగారు వారిని ఇంటర్వ్యూ చేసి వారికొరకు ప్రార్థించారు. యు.పి.ఎఫ్. పాస్టర్స్ వారికి బాప్తిస్మ క్లాస్ తీసికొన్నారు. యు.పి.ఎఫ్. పాస్టర్స్ అందరూ పాల్గొన్నారు.

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

**నిర్వహించు**

## వి.బి.యస్.- 2018

**(వెకేషన్ బైబిల్ స్కూల్)**

**అంశము : "అద్భుత సత్యాలు"**

**- మత్తయి 11:15**

**"Amazing Truths"**

**తేదీలు : 15 ఏప్రిల్ (ఆదివారం) నుండి 24 ఏప్రిల్ (మంగళవారం) 2018 వరకు**

**ఉ॥ 7 గం॥ల నుండి 10 గ॥ల వరకు**

**స్థలము :**

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్-20.**

**Ph : 040-27624030 / 31**

# దేవుని వెయ్యి ఆదేశములు

## 133. "దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి." – ఎఫెసీ 6:17

ఇది నీ కుడిచేతిలో ధరించుకొనవలసిన ఆయుధం. దేవుని వాక్యమనే ఆత్మ ఖడ్గముచేత సాతానుని ఎదిరించాలి. **"దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది."** – హెబ్రీ 4:12. మన మనస్సులో సాతానుడు ప్రవేశపెట్టిన సందేహాలు, దుష్ప్రేరణలు అను వాటికి వ్యతిరేకంగా నీవు దేవుని మాటలను పలుకుతుండాలి. నా అనుభవంలో నేను దైవకార్యాలు చేసి బాగా అలసిపోయి ఉన్నప్పుడు సాతానుడు వచ్చి – నీవు ఇన్ని కార్యాలు బాగానే చేశావు కాని తరువాత కార్యమును చేపట్టడము అనుమానమే అని అంటాడు. అప్పుడు నేను సజీవురాలనై దేవుని కార్యములను వివరిస్తానని సాతానుడు తెచ్చిపెట్టే సందేహాలను ఆత్మ ఖడ్గముతో ఛేదిస్తాను. అప్పుడు సాతానుడు నా వద్దనుండి పారిపోతాడు. యేసుప్రభువుకూడా శోధనలో ఈ సాధనాన్ని వాడాడు. 40 రోజులు ఉపవాసమున్న తర్వాత సాతానుడు ప్రభువును శోధించినప్పుడు వాక్యమనే ఆత్మ ఖడ్గంచేత అపవాదిని ఎదిరించాడు. నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లను రొట్టెలుగా మార్చుమన్నప్పుడు **"–మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను."** – మత్తయి 4:4 అప్పుడు సాతానుడు ఓడిపోయాడు. ప్రభువు ముమ్మారు శోధింపబడినను దేవుని వాక్యముచేతనే సాతానుని ఓడించాడు. సత్యమనే దట్టి, నీతియనే మైమరువు, సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సనే జోడు, విశ్వాసమనే డాలు, రక్షణయనే శిరస్త్రాణము అనేవి శత్రువునుండి తప్పించుకొనుటకు, భద్రతకొరకుగల ఆయుధాలు. కాని వాక్యమనే ఆత్మఖడ్గము శత్రువును హతం చేయుటకొరకై యుంది. సాతాను దగ్గరినుండి వచ్చేవాటిని ఖండించే గొప్ప ఆయుధమునై యుంది. ఇవన్నీ ధరించుకొని వెనుదిరిగితే వెనుక నీ వీపునకు ఎలాంటి కాపుదల లేదు. వెనుదిరిగావంటే సాతాను నీమీదకు అంబు వేస్తాడు. అప్పుడు కుప్పకూలిపోతావు. కావున విశ్వాసి ఎల్లప్పుడు ముందుకే వెళ్లాలి.

## 134. "ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుడి." – ఎఫెసీ 6:18

ప్రతి సమయమునందు ప్రతి విధమైన ప్రార్థనచేయాలంటే మన జీవితంలో ఇక ఏ పని చేయక కేవలం ప్రార్థనే చేయాలని కాదు. నా అనుభవంలో నేను నేర్చుకున్నదేమిటంటే ప్రార్థన చేయాలి, పని చేయాలి. దినమంతా చిన్న చిన్న ప్రార్థనలు చేస్తూనే ఉండాలి. పని చేస్తూ ప్రార్థించాలి. నీ జీవితంలోని ప్రతి ఖాళీని ప్రార్థనతో నింపివేయాలి. బస్సు ఎక్కి కూర్చున్నావంటే ఎక్కిన దగ్గర్నుండి దిగేవరకు ప్రార్థన చేస్తూనే ఉండాలి. అటు, ఇటు చూసి సమయాన్ని పోనివ్వకుండా మెలకువ కలిగి ప్రార్థించాలి. నీ గమ్యం వచ్చేలోగా నీ పిల్లలందరికొరకు, భర్తకొరకు ప్రార్థించాలి. ఇంట్లో పనులు చేసేటప్పుడు, పిల్లలకు పరిచర్య చేసేటప్పుడు ప్రార్థించాలి. ప్రతి సమయమునందు ప్రతి విధమైన ప్రార్థన చేయాలి.

## 135. "సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి." – ఎఫెసీ 6:18

పరిశుద్ధులు అంటే విశ్వాసులు, యేసు రక్తముతో కడుగబడిన జనము. తెల్లబట్టలు ధరించి ప్రసంగ పీఠములెక్కి ప్రసంగము చేసేవారే పరిశుద్ధులు అని కాదు. వారు అభిషిక్తులు. దేవుడు వారిని ఒక కార్యంకొరకు అభిషేకించి వాడుకుంటున్నాడు. కాని యేసుప్రభువు రక్తంతో కడుగబడిన ప్రతి ఒక్కరు పరిశుద్ధులే. విశ్వాసి ఎల్లప్పుడు తోటి విశ్వాసులకొరకు పట్టుదలతో ప్రార్థిస్తుండాలి. స్వార్థం ఉండకూడదు. కేవలం నీకొరకు, నీ ఇంటివారికొరకు ప్రార్థించి ముగించడం కాదు. కొందరు ఇంట్లో ఉన్న పెంపుడు కుక్కలకొరకైనా ప్రార్థిస్తారు కాని తోటి విశ్వాసులకొరకు ప్రార్థించరు. నీవు దేవుని ప్రేమ కలిగి ఇరుగు పొరుగు వారికొరకు, నీకు తెలియజేసిన ప్రార్థన విన్నపములన్నిటికొరకు విజ్ఞాపన చేయాలి. శ్రమలో ఉన్న సేవకులకొరకు, పరిశుద్ధులకొరకు, దైవకార్యాలు చేసే భక్తులకొరకు, దేవుని చిత్తము నెరవేర్చే కాపరులకొరకు ఎల్లప్పుడు ప్రార్థన చేయాలి.

**"మరియు నేను దేనినిమిత్తము రాయబారినై సంకెళ్లలో ఉన్నానో, ఆ సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు నేను మాటలాడ నోరు తెరచునప్పుడు దానినిగూర్చి నేను మాటలాడవలసినట్టుగా ధైర్యముతో మాటలాడుటకై వాక్శక్తి నాకు అనుగ్రహింపబడునట్లు నా నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి."** – ఎఫెసీ 6:19–20. కొందరు ఇతరులను ప్రార్థన కోరడం లోకువగా భావిస్తారు. భక్తకోటికి అపొస్తలుడైన పౌలు నాకు ఏ భయం లేకుండా అన్యజనులకు సువార్త అందించు నిమిత్తం పూర్ణమైన పట్టుదలతో వాక్శక్తి అనుగ్రహింప బడునట్లుగా ప్రార్థించమని సంఘముతో, తోటి విశ్వాసులతో అడుగు తున్నాడు. ఇతరులకు ప్రార్థన అవసరతలు తెలియజేయుటలో మీరేమీ తక్కువగా తలంచవద్దు. ఎంతటి భక్తులైనా సంఘాన్ని ప్రార్థించమని కోరవచ్చు. యేసురక్తంతో కడగబడిన ప్రతివారు దేవుని కుటుంబములోకి వచ్చేస్తారు. నీవు అలాంటి వారందరికొరకు ప్రార్థించే బాధ్యత కలిగియున్నావు. సాతానుడు ఏ దిక్కునుండి నీపై దాడికి వస్తాడో, ఎంత కుయుక్తితో, ఎన్ని కుతంత్రాలతో, ఎన్ని పన్నాగములతో నిన్ను మోసం చేయడానికి, నీ పతనాన్ని చూడడానికి వస్తాడో తెలియదు గనుక ప్రార్థనతో మెలకువగా ఉండాలి. **"నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు."** – 1 పేతురు 5:8. మనం సాతాను తంత్రములను యెరిగినవారము కాబట్టి మెలకువగా ఉండి ప్రార్థిస్తూ ముందుకు వెళ్లాలి.

## 136. "మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు;" – ఎఫెసీ 5:18

మీరు ఆత్మపూర్ణులై యుండాలి. మీరు మద్యముతో మత్తులై ఉండడము దేవునికి ఇష్టము లేదు. దానిలో దుర్వ్యాపారము, దుర్వ్యసనాలు, పాపము ఇమిడి ఉన్నాయి. మద్యపాని వాని దిగులు, భయము, అలసట మరచిపోయి ఆనందమును పొందుటకు మద్యము సేవిస్తాడు. కాని అది తాత్కాలికమైన, క్షణభంగురమైన సంతోషమే. దానివలన కలహాలు, వాదనలు, పాపము, గాయాలు అవుతాయి. అలాకాక, మీరు దేవుని ఆత్మచేత నింపబడి ఉండడము దేవునియందు మత్తును కలిగిస్తుంది. ఎల్లప్పుడు పరిశుద్ధాత్మతో నింపబడి ఉంటే మీరు మీ బాధలు, దిగులు, భయము మరచిపోయి ఆనందము పొందుతారు. ఇది తాత్కాలికమైన సంతోషం కాదు నిత్యసంతోషము. **"ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి."** –ఫిలిప్పీ 4:4. పౌలు ఈ మాటను వ్రాసేటప్పుడు చెరలో సంకెళ్లలో ఉన్నాడు. అతను ఆ స్థితిలో సంతోషంగా ఉండడమే కాక, శ్రమల్లో ఆనందించాలని, సంతోషించాలని సంఘానికి చెబుతున్నాడు. మద్యం త్రాగినవాడు ఆనందిస్తాడు గాని ఎన్నో తిప్పలు పడతాడు. ఇంటికి వస్తే కలహం, దార్లో పడిపోతే గాయాలు, డబ్బులుంటే ఎవరైనా దోచుకుంటారు. వానికి ఉండే వ్యసనాలు ఇంతంత కాదు. ఎంత పెద్ద హోదా ఉన్నా, జిల్లా కలెక్టర్ అయినా, డాక్టర్ అయినా త్రాగేవాన్ని త్రాగుబోతు అనే పిలుస్తారు. కాని ఆత్మపూర్ణులై ఉన్నవారిని దైవజనులని, దేవుని బిడ్డలని, పరిశుద్ధాత్మతో నింపబడినవారని ఈ లోకము గమనిస్తుంది. మీరు క్రుంగుదల, వ్యాకులము, బాధలను జయించాలంటే ఆత్మపూర్ణులై ఉండాలి. త్రాగుబోతు త్రాగిన తర్వాత కోపించడం, చెడ్డ మాటలు, బూతులు మాట్లాడడం, శపించడము చేస్తాడు. కాని ఆత్మపూర్ణులైన వారు పాటలు పాడుతారు, సాక్ష్యము చెబుతారు, సేవ చేస్తారు. ఇతరులతో ఆ సంతోషాన్ని పంచుకుంటారు. దేవుని మహిమపరుస్తారు. ఆత్మపూర్ణులై ఉండడం పరిశుద్ధాత్ముడు మనకు అందించే గొప్ప వరము.

**"ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమునుగూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి."** – ఎఫెసీ 5:19–21. ఇందులో ప్రార్థన, తగ్గింపు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించడము, పరిశుద్ధాత్మయందలి ఆనందము ఉన్నాయి. ఇంతవరకు పరిశుద్ధాత్మను పొందనివారు ప్రార్థించి ఆత్మపూర్ణతను పొందాలని తెలియజేస్తున్నాను. ఆత్మకొరకు ప్రార్థించేవారికి దేవుడు కొలతలేని ఆత్మనిస్తానని వాగ్దానం ఇచ్చాడు. దానికి ఏ కొలబద్ద లేదు. దేవుడు నిన్ను పరిపూర్ణంగా ఆత్మతో నింపగలడు.

## 137. "విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి."

– 1 కొరింథీ 6:20

ఈ ఆదేశము ఆత్మపూర్ణులైనవారికి, యేసు ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించినవారికి. దేహము దేవుని ఆలయము, పరిశుద్ధాత్మకు నిలయము. కావున నీ దేహముతో నీవు ఏ పాపమును చేయకూడదు. దేహము నీ వశములో లేదు. ప్రభువు విలువపెట్టి నిన్ను కొనుక్కున్నాడు. తన స్వరక్తమిచ్చి నిన్ను సంపాదించుకున్నాడు. దేహము నీది కాదు గనుక దానితో నీవు పాపమును చేయకూడదు. పాపము నిన్ను ప్రేరేపించినప్పుడు ఏం చేయాలి? శరీరేచ్ఛలను ఏ విధంగా జయించాలి? అను వాటికి పరిశుద్ధ గ్రంథము చక్కని జవాబు నిస్తుంది. **"ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు."** – గలతీ 5:16. మీరు ఆత్మపూర్ణులుగా ఉంటే మీకు శరీరంమీద జయం వస్తుందని పౌలు చాలా స్పష్టంగా ఆత్మప్రేరణతో లేఖనముల్లో వ్రాశాడు. **"పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి."** – రోమా 12:1. నీ శరీరాన్ని సజీవయాగంగా, బలిగా దేవునికి అర్పించుకోవాలి. ఎందుకంటే శరీరము దేవుడు నివసించే స్థలం. చెలగాటమాడటానికి, పాపముతో ఆడుకోవడానికి దేహము నీ సొత్తు కాదు అది దేవుని సొత్తు. నీవు విలువపెట్టి కొనబడినవాడవు. యేసుప్రభువు తన రక్తమిచ్చి నిన్ను సంపాదించుకొన్నాడు గనుక దేహముతో పాపము చేయడానికి ఏ మాత్రము వీలులేదు. దేవుడు నివసించే ఘటమే ఈ శరీరము. గనుక నీవు పాపమునకు దూరంగా పారిపోవాలి.

**"జారత్వమునకు దూరముగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతి పాపమును దేహమునకు వెలుపల ఉన్నది గాని జారత్వము చేయువాడు తన సొంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు. మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు. విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి."** – 1 కొరింథీ 6:18–20. పాపమునకు, జారత్వమునకు దూరంగా పారిపోవాలంటే ఎక్కడికి పారిపోవాలనేదానికి దేవుడు చక్కని జవాబునిచ్చాడు. **"యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును."** – సామెతలు 18:10 ఈ లోకపాపములు, శరీరేచ్ఛలు నిన్ను ప్రేరేపించినప్పుడు, లొంగదీసికొనుటకు ప్రయత్నించినప్పుడు దేవుని నామమనే దుర్గము క్రిందకు వచ్చి సురక్షితంగా ఉండాలి. సూక్ష్మంగా ఆలోచిస్తే విశ్వాసి లైంగిక అవినీతి సంబంధమైన ఆలోచనలకుకూడా అనుమతించకూడదని అర్థము. పరిశుద్ధాత్మతో నింపబడినయెడల నీవు అలాంటి పాపము చేయలేవు. ఒకవేళ ఏదైనా పాపము నిన్ను వెంబడించినా దాన్ని నిలుపుకొనక దేవుని సన్నిధిలో దులుపుకొని పరిశుద్ధత పొందాలి. నీ స్వేచ్ఛకు కాక, దేవుని నామమునకు ఘనత కలిగే రీతిగా నీ దేహము వాడబడాలన్నది ఈ ఆదేశముయొక్క అర్థము. నీ దేహముద్వారా దేవునికి ఆనందము కలగాలి, దేవుని చిత్తము నెరవేరాలి, దేవునికి ఘనత రావాలి. నీ జ్ఞానమైనా, తెలివైనా, ఆరోగ్యమైనా, సామర్థ్యమైనా ప్రభువుకొరకు వాడాలి.

### 17 గంటల "దేవుని వెయ్యి నామములు" స్తుతి మరియు ప్రార్థన

అమ్మగారు 05.04.2018, గురువారమున ప్రార్థించి ఈ కార్యక్రమము ఆరంభించారు. 06.04.2018, శుక్రవారము ప్రతిష్ఠ ప్రార్థన జరిగింది. ప్రతిరోజు ఉ॥ 4 గంటల నుండి రా॥ 9 గంటల వరకు యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో ఈ కార్యక్రమము జయకరంగా జరుగుతుంది. విశ్వాసులు వారు నిశ్చయించుకొనిన సమయముల్లో ఈ ప్రార్థనలో పాలుపొందుచున్నారు.

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. దుప్పటి శ్యామల, పరకాల, వరంగల్:** నేను ఎన్నో శ్రమలు, బాధలు, కష్టాల్లో ఉన్నప్పుడు అమ్మగారి జీవపు మాటలు అనే టి.వి. వర్తమానములద్వారా ఆదరణ పొందాను. నాకు తల్లిదండ్రులు లేరు. అమ్మ మాటలద్వారా దేవుడు నన్నెంతో ఆదరిస్తున్నాడు. నా తలకు పెద్ద దెబ్బతగిలినప్పుడు దిమ్ముగా ఉండేది. అమ్మగారు ప్రార్థించి ఇచ్చిన ప్రార్థన నూనె తలకు పెట్టుకొని టి.వి.లో అమ్మగారి ప్రార్థనతో ఏకీభవిస్తుండగా అమ్మగారు టి.వి. ద్వారా వాక్యం వింటున్నవారికి స్వస్థత కలగాలి అని ప్రార్థించారు. దేవుడు నా బాధ తీసేశాడు.

మరియు మా కుమారుడు, కుమార్తె టి.వి. ప్రార్థనలో అమ్మగారితో ఏకీభవించుటద్వారా దేవుడు గొప్ప కార్యములు చేశాడు. మా కుమార్తెకు అదిలాబాద్‌లో ఎం.బి.బి.ఎస్. సీటు వచ్చింది. మా కుమారునికి 10వ తరగతిలో 10/10 జి.పి.ఎ. వచ్చింది. బాసర ఐ.ఐ.టి.లో సీటు వచ్చింది. చాలా కష్టాలు, బాధల్లో అమ్మగారి వర్తమానములద్వారా మేలు పొందాను. నా భర్త నగర పంచాయితీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగము చేస్తాడు. పోల్‌పై నుండి తలక్రిందులుగా పడ్డాడు. దేవుని కృపవలన ఏ అపాయము కలుగలేదు. అమ్మగారి ప్రార్థనవలన నా కుటుంబము క్షేమంగా ఉంది. టి.వి. ద్వారానే కాక నేరుగా అమ్మగారిని చూడడానికి దేవుడు కృపనిచ్చాడు. నాకు ఎక్కడా దొరకని ఆదరణ మాటలు, శాంతి, సమాధానం, తృప్తి యు.పి.ఎఫ్.లో లభించింది. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**2. దెబోరా, రాంనగర్:** నా భర్త ప్రమోషన్‌కొరకు మేము కొన్ని నెలలనుండి ప్రార్థిస్తున్నాము. నా భర్త అమెజాన్ కంపెనీలో ఉద్యోగము చేస్తాడు. డిగ్రీ లేనందున ప్రమోషన్ ఇవ్వడం లేదు. కాని అతనికి చాలా టాలెంట్ ఉంది. ప్రమోషన్ కావాలని కోరితే మేనేజర్‌గా కోయంబత్తూర్‌కు ప్రమోట్ చేసి ఇంక్రిమెంట్ ఇస్తానన్నారు. 2017 మే లో మా బంధువులు మీరు అక్కడికి వెళ్లాలని సలహా ఇచ్చారు. నేను 1998 నుండి యు.పి.ఎఫ్.కు వచ్చి ఇక్కడే బలపడ్డాను. ఇక్కడే నా జీవితాన్ని దేవుడు స్థిరపరచాడు. మంచి ఆత్మీయతల్లి, సహవాసం, యు.పి.ఎఫ్.ని విడిచి బంధువులు ఎవ్వరూలేని చోటుకి వెళ్లాలా అని ఆలోచిస్తూ ప్రార్థిస్తున్నాను. మా బంధువులు మీరు కోయంబత్తూర్ వెళ్తే దేవుడు మిమ్మును ఆశీర్వదిస్తాడేమో అన్నారు. నేను, నా పిల్లలు ప్రార్థించాము. మందిరములో ప్రార్థన విన్నపము తెలియజేశాను. దేవుడు గొప్ప అద్భుతకార్యము చేశాడు. కాంపిటీషన్ ఉన్న దగ్గరే దేవుడు హెచ్చిస్తాడు. మనకు సహాయం పై నుండి రావాలని నేను చెప్పేదాన్ని. అలాగే 6 నెలల్లో హైదరాబాద్‌లోనే దానికన్నా ఉన్నతమైన ఇంక్రిమెంట్‌తో ప్రమోషన్ లభించింది. నా భర్తకి ఉన్న బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డ్స్, ఇతర అవార్డ్స్ చూసి ఇంకా ఇతనిని ఎందుకు ప్రమోట్ చేయడంలేదని ప్రమోషన్ ఇచ్చి పర్మినెంట్ చేశారు. అతని ఆరోగ్య విషయంలోకూడా దేవుడు కృపచూపాడు. 2018 ఫిబ్రవరి లో ప్రమోషన్ నిర్ధారించారు. కోయంబత్తూర్‌లో కన్నా ఇక్కడ 3 రెట్లు ఎక్కువ ఇంక్రిమెంట్ లభించింది. ప్రమోషన్‌కి మరో ఇద్దరు జాయిన్ అయ్యారు. వారికి 2 షేర్స్ ఇస్తే మా వారికి 4 షేర్స్ ఇచ్చారు. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి, సంఘానికి నా వందనములు.

**3. చంటి, నారాయణగూడ:** నేను నడుమునొప్పి అని హాస్పిటల్‌కు వెళ్తే గాల్‌బ్లాడర్‌లో రాళ్లున్నాయి, ఆపరేషన్ చేయాలన్నారు. మేము సిద్ధపడ్డాము గాని గవర్నమెంట్‌నుండి అప్రూవల్ రావాలి, లేకుంటే ఆపరేషన్ చేయము అన్నారు. యు.పి.ఎఫ్. మందిరములో మాకొరకు ప్రార్థన చేశారు. దేవుడు మాపై తన కనికరము చూపించాడు. గంటలో అప్రూవల్ ఓ.కే. అయ్యింది. దేవుడు అన్నీ అనుకూలపరచాడు. నన్ను ధైర్యపరచి ఆపరేషన్ విజయ వంతమగుటకు కృపచూపాడు. శీఘ్రస్వస్థత నిచ్చి నన్ను సాక్షిగా ఉంచాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి, సంఘానికి మా వందనములు.

**4. జె.వి. రమణ, ఆంధ్రాబ్యాంక్ మేనేజర్, నల్లకుంట:** మా కుమారుడు రోహిత్ బి.టెక్ (ఇంజనీరింగ్) అయి క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగము వచ్చింది. ఇంటర్న్‌షిప్‌లో చేరాడు. అతనికి పి.జి. చేయాలనే కోరిక కలిగింది. ఎం.ఎస్. చేయాలనుకున్నాడు. తర్వాత ఎం.బి.ఎ. చేస్తానన్నాడు. సింబయాసిస్ పుణె దానికి పరీక్ష వ్రాశాడు. అది చాలా కష్టంగా ఉందన్నాడు. నేను – మనం ప్రార్థిద్దాము దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదని చెప్పాను. ఒక సంవత్సరమంతా చదివి వ్రాస్తానన్నాడు. ప్రార్థిస్తే సంవత్సరం వృథాకాకుండా పరీక్ష పాసయ్యాడు. పుణెలో ఇంటర్వ్యూ అన్నారు. అమ్మగారికి, యు.పి.ఎఫ్. సంఘానికి ప్రార్థన మనవి తెలియజేశాము. అక్కడ కాలేజీలో 90 సీట్లు ఉన్నాయి. గాని ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు వచ్చినవారు 1500 మంది. మా బ్యాంకులో ప్రమోషన్స్‌కొరకు 1:3 లేదా 1:2 రేషియోలో పిలుస్తారు. కాని ఇప్పుడు 1:15 రేషియోలో ఉంది. ఇంటర్వ్యూకి వచ్చిన జనాలను చూస్తే అమ్మాయిలు, అబ్బాయిలు పుణె, ముంబాయి, చండీఘర్, కోల్‌కతానుండి వచ్చినవారు, మంచి మంచి స్కూల్స్‌నుండి వచ్చినవారు. మరియు అందరూ సూట్స్ వేసికొని వచ్చారు. మాకు ఈ యూనివర్సిటీలో రావడం కష్టం అనుకున్నాము. దావీదు – గొల్యాతు కథలో దావీదు గొఱ్ఱెల కాపరి, అతనికి యుద్ధం తెలియదు. చదువు, జ్ఞానం, సామర్థ్యం ప్రకారం గొల్యాతు గెలివాలి కాని దావీదు గెలిచాడు. అతని వెనుక దేవుడు ఉన్నాడు. నేను దీనిని నమ్ముతాను. దేవుడు మా విషయంలో మహాద్భుతము జరిగించాడు. 27.1.2018న నెట్‌లో రిజల్ట్స్ పెడతామన్నారు. ఆ రోజు సాయంత్రం బాబు ఫోన్‌చేసి సీటు వచ్చిందని చెప్పాడు. ఆ 90 మందిలో మా కుమారుని ఒకనిగా ఉంచిన దేవునికి స్తోత్రములు. ఇప్పుడు మా కుమారుడు కంపెనీ మాని పుణె యూనివర్సిటీలో చేరనైయున్నాడు. ప్రార్థించిన అమ్మగారికి సంఘానికి మా వందనములు.

**5. రోస్ రాబర్ట్, రాంనగర్ గుండు:** మేము 3 సంవత్సరాలనుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాము. అమ్మగారు మాకొరకు చాలా ప్రార్థించారు. ఇక్కడికి వచ్చాక మేము చాలా ఆశీర్వదింపబడ్డాము. ఏ సమస్య వచ్చినా అమ్మగారికి చెప్పి ప్రార్థన చేయించుకుంటాము. మా సమస్య తీరిపోతుంది. వైజాగ్‌లో ఉన్న మా మూడవ సహోదరియొక్క సంవత్సరము వయస్సున్న బాబు అభినవ్‌కు బ్రెయిన్‌లో చిన్నగా గడ్డ అయి అస్వస్థతగా ఉన్నాడని ఫోన్ చేసింది. మేము ఉపవాసము ఉండి ప్రార్థించాము. అమ్మగారికి చెప్పి ప్రార్థన చేయించుకొన్నాము. వైజాగ్‌లో తెలిసిన డాక్టర్ దగ్గర చూయించారు. నేను అమ్మగారికి వాట్సాప్ మెసేజ్ చేశాను. అమ్మగారు వెంటనే ప్రార్థించారు. బ్రెయిన్‌కు ఎఫెక్ట్ అవుతుంది గనుక ప్రమాదమని డాక్టర్స్ చెప్పారు. రెండవసారి అమ్మగారికి మెసేజ్ చేశాను. అతని పేరిట ప్రార్థించమని మందిరంలో ప్రార్థన విన్నపము ఇచ్చాను. అమ్మగారు, సంఘము అతనికొరకు ప్రార్థించారు. ఎం.ఆర్.ఐ. స్కానింగ్ తీసిన డాక్టర్లు బ్రెయిన్‌లో ఏమీలేదు అని చెప్పారు. అంతా కరిగిపోయిందని రిపోర్టు వచ్చింది. చాలా ప్రమాదం అని చెబితే అందరం భయపడ్డాము. అమ్మగారు, సంఘము, అక్కడి సంఘము ప్రార్థనలవలన దేవుడు బాబుకు శీఘ్రస్వస్థత ఇచ్చాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**6. ఎం. ప్రసన్న, సైదాబాద్:** నాకు వివాహమై ఒకటిన్నర సంవత్సరము అవుతుంది. సంతానంకొరకు కనిపెడుతున్నాము. 2017 నవంబర్‌లో దేవుడు నా గర్భము తెరచాడు. నేను గర్భము దాల్చాను. అయితే నేను 2017 డిసెంబర్‌లో గ్యాస్ట్రిక్ సమస్యవలన అస్వస్థతకు గురయ్యాను. 2018 ఫిబ్రవరి లో పైల్స్‌వలన రక్తస్రావమైతే హాస్పిటల్‌కు వెళ్లాను. అప్పుడు యు.పి.ఎఫ్. సంఘంలో ప్రార్థన విన్నపము ఇచ్చాము. సంఘం నా కొరకు ప్రార్థించారు. అప్పుడు బాగై నొప్పి తగ్గిపోయింది. మరియు నాకు థైరాయిడ్‌కూడా ఉంది. నేను ప్రార్థన చేసికున్నాను. సంఘములో ప్రార్థించారు. థైరాయిడ్ రిపోర్ట్ నార్మల్ వచ్చింది. ఇప్పటివరకు నాకు ఏ సమస్య లేకుండా దేవుడు నన్ను కాపాడుతున్నాడు. ఇప్పుడు నేను 5నెలల గర్భిణిని. శీఘ్రస్వస్థత ఇచ్చిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి సంఘానికి వందనములు.

**7. ప్రమీల, రాంనగర్:** మా బావ కూతురు రాజేశ్వరికి (26 సం॥లు) బ్రెయిన్‌లో ట్యూమర్ ఉంది. దానివలన ఆమె చాలా సమస్యలు ఎదుర్కొంటుంది. 2.3.18న ఆమెకు ఆపరేషన్ ఉంది. అమ్మగారు, యు.పి.ఎఫ్. పాస్టర్లు ప్రార్థించారు. దేవుని కృపవలన ఆపరేషన్ జరిగింది. కాని ఆ ట్యూమర్‌ని పూర్తిగా తొలగించలేదు. అది వేరే ప్రాముఖ్యమైన 3 నరాలకు కలసి ఉంది. ట్యూమర్ తీసినా, తీయకపోయినా ఆమెకు ప్రమాదమే అన్నారు. తీసినా ఆమె బతుకుతుందని గ్యారంటీ ఇవ్వలేమన్నారు. మేము దేవునిపై విశ్వాసంతో ఆపరేషన్‌కు ఒప్పుకున్నాము. రాత్రంతా ప్రార్థించాము. సంఘము ప్రార్థించారు. ఆపరేషన్ విజయవంతమైంది. 2 వారాల తర్వాత మళ్లీ అడ్మిట్ కావాలన్నారు. కరెంట్ షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తామన్నారు. ఆ సమయంలోనైనా ఆమె చనిపోవచ్చన్నారు. దేవుడు కనికరం చూపి ఆ ట్రీట్‌మెంట్‌లోను అమ్మాయిని కాపాడాడు. 9.3.18న డిశ్చార్ అయి ఇంటికి వచ్చింది. మరణం తప్పించి స్వస్థతనిచ్చి క్షేమంగా కాపాడి సజీవుల లెక్కలో ఉంచిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి, సంఘమునకు వందనములు.

**8. రమణ, సరూర్‌నగర్:** నేను 10 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్.కి వస్తున్నాను. మనము నూటికి నూరు శాతం దేవునిపై ఆధారపడితే దేవుడు మన కార్యము నెరవేరుస్తాడు అని రుచిచూచి తెలిసికొన్నాను. నేను అసాధ్యమైనవి సాధ్యపరచుట అంటే ఏమిటని అనుకునేదాన్ని. దేవుడు దాన్ని నా జీవితంలో రుజువు చేశాడు. నేను కొన్నాళ్ల క్రితం 15 లక్షలతో ఒక ఫ్లాట్ కొన్నాను. సంవత్సరం క్రితం మా ఇంటికి వచ్చిన చుట్టాలు మీ ఇల్లు చిన్నది, ఇల్లు చిన్నది అని బాధపెట్టారు. మేమైతే ఆ ఇంట్లో సంతోషంగా ఉన్నాము. అందులో శుభకార్యములు (పిల్లల పెండ్లి మొదలైనవి) జరిగాయి. అయితే వికారాబాద్ నుండి సంఘ సహోదరి సునంద తనకు ఇల్లు చూడడానికి రమ్మంటే వెళ్లాను. మంచి ఇల్లు ఇవ్వమని దేవుని అడిగితే రూ. అరవై లక్షలలో ఆమెకు మంచి ఇల్లు లభించింది. అయితే ఇల్లు చూయించిన వ్యక్తి ఇంకో ఇల్లు బాగుంది చూద్దువురా! అన్నారు. నేను వద్దన్నా మళ్లీ అడిగారు. మాకు అంత స్థోమత లేదు. ఎందుకు చూడాలి? ఆశించాలి అన్నాను. సహోదరి సునంద ఆరోగ్యం బాగోలేక వి.ఆర్.ఎస్. తీసికుంటే ఆమెకు రూ. ఇరవై ఐదు లక్షలు వచ్చాయి. ఆమె – రమణా, మీరు ఇల్లు తీసికోండి. మీ భర్త రిటైరయ్యాక నా డబ్బు నేను తీసికుంటాను అనింది. ఇల్లు తీసికోమని పట్టుపట్టింది. ఆమె, బిల్డర్ అడుగుతుంటే నేను మా వారితో చర్చించి ప్రభువుతో చెబుతూ ప్రభువునే ఆశ్రయించాను. ఆమె స్వంత బంధువులా సహకరించింది. 140 గజాలు ఇల్లు చాలా బాగుంది. దేవా, నీ చిత్తం అని ప్రార్థించా. వాళ్లు పట్టుపట్టి రూ.ఇరవై ఐదు లక్షలు ఇచ్చారు. పది లక్షలు మా అక్క ఇచ్చింది. పదిహేను లక్షల రూపాయలు లోన్ తీసికున్నాను. అలా యాభై లక్షల రూపాయల్లో ఇల్లు తయారైంది. దేవుడు గొప్ప దేవుడు. పరిస్థితులు, మనము ఎలా ఉన్నా దేవునిపై భారం వేసి అమ్మగారు వ్రాసిన దేవుని వెయ్యి నామములు చదివితే దేవుడు ఆశ్చర్యకార్యము చేస్తాడు. మాకు అందరున్నారు. నలుగురు మరుదులు ఉన్నారు. కాని మేము దేవుని వైపే చూశాము. అన్నవాళ్ల అన్నట్టు దేవుడు వారి నోళ్ల మూయించి అద్భుతకార్యము జరిగించి అసాధ్యమైన కార్యము సాధ్యపరచాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**9. భరత్‌రావ్:** నేను 2001వ సంవత్సరమునుండి యు.పి.ఎఫ్. సంఘానికి వస్తున్నాను. కుటుంబముగా అమ్మగారితో పరిచయము ఏర్పడి వారితో మా బాధ, వేదన చెప్పుకొనుచు ప్రతి విషయంలో ఎంతో ఆదరాభిమానాలు, ప్రార్థన పొందుతున్నాము. ఇక్కడికి వచ్చిన ఈ 17 సంవత్సరాలలో జరిగిన 3 విషయాలు పంచుకుంటాను. ఒకటి, నేను హాస్పిటల్‌లో ఉండగా 2001వ సంవత్సరంలో నాకు క్యాన్సర్ సస్పెక్ట్ చేశారు. ఆ రోజు రాత్రి నేను లేవలేక, కూర్చోలేకపోయాను. నిద్రలో స్వప్నం. ఆ స్వప్నంలో అమ్మగారు నాకు ప్రార్థిస్తున్నారు. ఆమె దగ్గరినుండి పరిశుద్ధాత్మ నామీదకు ప్రవహిస్తున్నట్టు అయ్యింది. వెంటనే మెలకువ వచ్చింది. 5, 6 నిమిషాలు క్రొత్త అనుభవము కలిగింది. దాన్ని నేను తిరిగి చెప్పలేను. నేను లేవకూడదు కాని పండుకున్నవాన్ని లేచి హల్లెలూయా! హల్లెలూయా! అంటూ తిరుగుతున్నాను. ఆ అనుభూతి వివరింపలేనిది. ఉదయం "నో ఎవిడెన్స్ ఆఫ్ మాలిగ్నెన్స్" (క్యాన్సర్ లేదు) అనే రిపోర్ట్ వచ్చింది. ఆ రోజే డిశ్చార్జ్ అయ్యాను. నేను బయటకు వెళ్లలేదు. కాని నేను పొందిన అనుభూతి ఆపుకోలేక యు.పి.ఎఫ్. మందిరానికి వచ్చి నా సాక్ష్యము పంచుకొన్నాను. రెండవది, మా మనవరాలికి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమె అమెరికాలో ఉంటుంది. అమ్మగారు ఆమెకు చాలా మంచి సంబంధముకొరకు ప్రార్థించారు. అమ్మగారు ప్రార్థించినట్లే మంచి సంబంధం వచ్చింది. అతను వైట్ అమెరికన్ మరియు యూదుడు. చాలా సంతోషించాము. ఎందుకంటే మంచి ఏషియన్ పద్ధతి, క్రమంలో సంఘంలో వివాహం జరిగింది. అమ్మగారి ప్రార్థనను మేము మరువలేము. మూడవది, డిసెంబర్ 2017లో నాకు శరీరంలో భయంకరమైన నొప్పి వచ్చింది. నేను ఆ నొప్పితో బాధపడుతూ అమ్మగారికి ఫోన్‌చేస్తే అమ్మగారు ప్రార్థించారు. రెండవ రోజు ఉదయం అమ్మగారి దగ్గరినుండి నాకు ఫోన్ వచ్చింది. అమ్మగారు – మీ కొరకు ప్రార్థిస్తున్నప్పుడు కలలో మీ వెంట్రుకలు తెల్లగా అయి ముఖం ప్రకాశిస్తుంది. మీరు అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. త్రియేక దేవుడు మీకు ఇంకా చాలా రోజులు ఆయుష్షు అనుగ్రహిస్తున్నాడు అన్నారు. నాకు ఎంతో సంతోషం కలిగింది. అప్పటికి నా వ్యాధి 250% పెరిగింది. కాని దేవుడు తన పరిశుద్ధ సేవకురాలైన అమ్మగారిద్వారా వాక్కును పంపాడు. ఆయన మాట వెనక్కు రాదు; ఆయన తన వాక్కును పంపి నన్ను బాగుచేస్తాడు. వాక్యము ఆయన సేవకులద్వారా విడుదలౌతుందని విశ్వసించాను. అమ్మగారు నాకొరకు ప్రార్థించారు. దేవుడు ఆ ప్రార్థనకు జవాబిచ్చాడు. నమ్మండి, దేవుని దయవలన నా వ్యాధి (నొప్పి) తగ్గిపోయింది. పూర్తిగా నార్మల్ అయ్యింది. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి నా వందనములు.

**10. ఎన్. రాజశ్రీ, సనత్‌నగర్:** నేను కొన్నాళ్లుగా గైనిక్ (యూట్రస్) సమస్యతో బాధపడుతున్నాను. ఒకరోజు ప్రార్థన చేసికొనుటకు యు.పి.ఎఫ్. ఆలయానికి వచ్చాను. ఆ రోజు అమ్మగారు మందిరములో ఉన్నారు. నాకు ఆపరేషన్ లేకుండా, కత్తివాత పడకుండా స్వస్థత కలగాలని ప్రార్థించారు. అమ్మగారు ప్రార్థించాక నాకు ఆపరేషన్ లేకుండానే స్వస్థత కలిగింది. ఇప్పుడు క్రమంగా పీరియడ్స్ అవుతున్నాయి. అమ్మగారు ప్రార్థించాక ఆరోగ్య విషయంలో, అన్ని విషయాల్లో నాకు మేలు జరుగుతోంది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**11. జోసఫ్, విద్యానగర్:** 2018 ఫిబ్రవరిలో నా ఎడమకాలు ఫ్రాక్చర్ అయ్యింది. మేము దానిని గమనించలేదు. బెణికిందనుకొని అలాగే వదిలేశాము. తర్వాత నడవడము, ఇబ్బందిగా మారితే హాస్పిటల్‌కు వెళ్లాము. డాక్టర్లు పరీక్షించి కాలు ఫ్రాక్చర్ అయ్యింది. నెల రోజులవరకు నడవద్దు, పూర్తిగా విశ్రాంతి తీసికోవాలని కొన్ని మందులు ఇచ్చారు. మేము యు.పి.ఎఫ్. మందిరములో ప్రార్థన విన్నపము తెలియజేశాము. దేవుని కృపనుబట్టి కీడు తొలగిపోయి శీఘ్రస్వస్థత పొందాను. డాక్టర్లు చెప్పిన సమయానికన్నా ముందే లేచి చక్కగా నడవగలుగుతున్నాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి సంఘానికి వందనములు.

**12. విజయమ్మ, లలితనగర్:** మా అమ్మాయికి (శోభశ్రీ) చాలా కాలం నుండి వివాహ సంబంధం కుదరడం లేదు. ఆ విషయమై మేమెంతో భారంగా ఉన్నాము. అయితే అమ్మగారు మా అమ్మాయికి మంచి సంబంధం రావాలని ప్రార్థించారు. అమ్మగారి ప్రార్థన ఫలించింది. దేవుని కృపనుబట్టి మంచి వివాహ సంబంధము వచ్చింది. అబ్బాయి (సురేష్‌బాబు) బి.టెక్ చదివాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. 2018 ఫిబ్రవరిలో మా అమ్మాయి నిశ్చితార్థము జరిగింది. యు.పి.ఎఫ్. పాస్టర్లు పాల్గొని ప్రార్థించారు. 11.4.18న వివాహము ఘనంగా జరిగింది.. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి సంఘమునకు మా వందనములు. అమ్మగారు, యు.పి.ఎఫ్. సంఘ ప్రార్థనలవలన మేము గొప్ప అద్భుతము పొందాము.

**13. రూబేను:** నేను వడ్రంగిని. 2017వ సంవత్సరం చివరి నెలలో చెక్కను కట్‌చేసే మెషిన్ నా కుడికాలు మీదకు ఎక్కితే కుడికాలి వ్రేళ్లు తెగిపోయినవి. ఆపరేషన్‌కు రూ.1,50,000 అవుతుందని డాక్టర్లు అన్నారు. యు.పి.ఎఫ్.

సంఘానికి మా విన్నపము తెలియజేసినపుడు, అమ్మగారు, సంఘమంతా కలసి నాకొరకు ప్రార్థించారు. నాకు నీ నామమంద్వారా అద్భుత కార్యము జరిగించు అని నేను ప్రార్థించాను. గాంధీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న యు.పి.ఎఫ్. సిస్టర్లుకూడా "మేము ప్రార్థిస్తాము, దేవుడు నీకు తోడుంటాడు, భయపడొద్దు" అని చెప్పి ధైర్యపరచారు. ఆపరేషన్ జయకరంగా జరిగింది. ఐదు వ్రేళ్లు తిరిగి అంటుకున్నాయి. ఏమీ ఖర్చులేకుండా దేవుడు స్వస్థత ఇచ్చాడు. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి, సంఘమునకు నా వందనములు.

**14. ప్రేమ, పార్శిగుట్ట:** మా స్వస్థలం మహబూబ్‌నగర్. మేము 2010వ సంవత్సరంనుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాము. మాకు 4,5 లక్షల అప్పు ఉన్నప్పుడు హైదరాబాద్‌కు వచ్చాము. ఆ సమస్యల్లో పనిచేసికోవడానికి హైదరాబాద్‌కు వచ్చినప్పటినుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాము. మా ఊర్లో వెళ్లినట్టు ఏదో ఒక చర్చికి వెళ్లాలని వచ్చాము. ముందు మాకు విశ్వాసం, రక్షణ తెలియదు. ఆదివారపు సాయంకాల ఆరాధనలో పాల్గొని వాక్యం వినడంద్వారా బలపడ్డాము. మొదటి నెల రోజులు నా భర్తకు ఏమీ పనిలేదు. నా భర్త కార్ డ్రైవింగ్ చేస్తాడు. మాకు వివాహమై 11 సంవత్సరాలు అయ్యింది. మాకు ముగ్గురు అమ్మాయిలు. నా భర్త మహింద్రకి కారు డ్రైవర్ ఉద్యోగం దొరికింది. మొదటి జీతము 3,000 రూపాయలు. నాలుగు లక్షల అప్పు. విశ్వాసములేకుండా ఉన్నాము. అప్పులు ఎక్కువ, చిన్న ఉద్యోగమని దేవుని ప్రార్థించాము. అమ్మగారి వర్తమానములు, మాటలద్వారా బలపడ్డాము. తర్వాత జీతము 15,000 రూపాయలు అయ్యింది. తర్వాత 20,000 రూపాయలతో సెకండ్ హ్యాండ్ కారు తీసికొని లీజుకు ఇచ్చాము. 20,000 రూపాయలు అప్పు కడుతున్నాము. 2 సంవత్సరాల క్రితం ఊర్లో క్రిస్మస్‌కు వెళ్లినప్పుడు కంపెనీనుండి కాల్ వచ్చింది. మీకు సూపర్‌వైజర్ జాబ్ నిర్థారన అయ్యింది రండి అన్నారు. ఆ సంవత్సరం **'నిన్ను గొప్ప చేయ మొదలు పెట్టెదను'** అనే వాగ్దానము వచ్చింది. ఇక్కడికి వచ్చాక కంపెనీ అధికారులతో మాట్లాడితే 25,000 రూపాయల జీతం ఇచ్చారు. అది అలాగే కంటిన్యూ అవుతుంది.

నేను అమ్మగారి మాటలు విని ఓ భార్య, తల్లి, కూతురు, కోడలిగా ఎలా ఉండాలో నేర్చుకొని బలపడ్డాను. కాని అప్పులు ఇంకా అలానే ఉన్నాయి. నా భర్తకు ఏ చెడు వ్యసనాలు, అలవాట్లు లేవు. కాని మా స్థితి అలానే ఉంది. విశ్వాసంతో ప్రార్థించాము. 2017 సిలువ ధ్యానాల్లో అమ్మగారు, మేము ప్రార్థించాము. మా నాన్నకు ఆరోగ్యం బాగైంది. 19.6.17న మా చెల్లి పుష్పవతి వివాహం జరిగింది. ఆమె పెళ్లి అసాధ్యంగా ఉండేది. మా వద్ద డబ్బు కూడా లేదు. కాని దేవుడు – అమ్మగారు, సంఘ ప్రార్థనవలన వివాహము ఘనంగా జరిగించాడు. మరియు 2017 డిసెంబర్ లో అమ్మగారు ఏర్పాటు చేసిన 21 రోజుల ఉపవాస ప్రార్థనలో పాల్గొని ప్రార్థించాము.

2017వ సంవత్సరంలో మేము వేరే వాళ్ల బండి తీసికొని 40 రోజుల సిలువ ధ్యానాల్లో పాల్గొన్నాము, ప్రార్థించాము. 25.1.2018న క్రొత్త బండి కొనుక్కొనుటకు దేవుడు కృప చూపాడు. మరియు నాకు ఆరోగ్యము బాగైంది. అయితే కొన్ని పరిస్థితులవలన 2018 జనవరి లో అప్పులు తీరక ఉద్యోగము కొనసాగుతుందో లేదో, ఆ కంపెనీ ఉంటుందో లేదో అనే ఒక సందర్భము ఏర్పడింది. అప్పుడు సంపూర్ణ రాత్రి ప్రార్థనలో ప్రార్థన విన్నపము వ్రాసి ప్రార్థించాము. అయితే కొత్త కంపెనీ వచ్చింది గాని నా భర్తగారి ఉద్యోగం కన్ఫాం అయ్యింది. 50 మంది డ్రైవర్లపై అదే స్థలములో నా భర్తని సూపర్‌వైజర్‌ను చేశారు. ద్వితీయోపదేశకాండము 28వ అధ్యాయములోని నిన్ను తలగా చేస్తాను, అప్పు ఇచ్చేవానిగా చేస్తాననే దేవుని వాగ్దానము నా భర్త పట్ల నెరవేరింది. 2018 జనవరి నుండి నా భర్త జీతము నెలకు 50,000 రూపాయలు. క్రమ క్రమంగా మమ్మును ఆశీర్వదించిన దేవునికి స్తోత్రములు. మాకొరకు భారంగా ప్రార్థించిన అమ్మగారికి మా వందనములు.

**15. సంజమ్మ, దిల్‌సుఖ్‌నగర్:** నాకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. నాకు యు.పి.ఎఫ్. గురించి తెలవదు. ఒకరోజు నాకు రెండవ స్టేజి క్యాన్సర్ అని రిపోర్టు వచ్చింది. ట్రీట్‌మెంట్ అవుతుంది. రెండు నెలలైనా నా ప్రాణం బాగోలేదు. పడిపోతున్నాను, లేవడం లేదు, తినడం లేదు. జ్యూస్‌లు త్రాగాలంటే నాకు షుగర్ ఉంది. ఏమీ తినలేను. అప్పుడు ఒక వ్యక్తి మీరు జాయ్ చెరియన్ అమ్మగారి దగ్గర ప్రార్థన చేయించుకొంటే రేపే బాగవుతుంది అని చెప్పాడు. నాకు రాంనగర్ తెలవదు. నా కొడుకుని తీసికొని యు.పి.ఎఫ్.కు 3 సార్లు వచ్చాను. అమ్మగారు అందుబాటులో లేనందున కలవలేదు. ఇక నాకు బాగుకాదేమో, ఇలానే ఉంటానేమో అని ఏడ్చాను. మరో రోజు అమ్మగారు ఉన్నారు. పిలిస్తే వెళ్లి అమ్మగారిని కలిసి ప్రార్థించుకొన్నాను. అమ్మగారు నన్ను చూసి 'నీకు ఏమీలేదు; నీవు భయపడే అవసరము లేదు' అని చెప్పి ప్రార్థనచేశారు. అమ్మగారితో ప్రార్థన చేయించుకొనుటకు వచ్చినప్పుడు నన్ను నలుగురు పట్టుకొని వచ్చారు. లేస్తే కూర్చోలేను, కూర్చుంటే లేవలేను. 3 నెలలు ఏమీ తినలేదు. ఏమీ బాగోలేదు. కానీ అమ్మగారు నీవు బాగౌతావు అని చెప్పారు. ప్రార్థించుకొని ఇంటికి వెళ్లిన తర్వాత కిడ్నీ వాపు వస్తే యశోదా హాస్పిటల్‌లో చికిత్స చేశారు. నేను అమ్మగారితో – అమ్మా నాకు ఒకటిపోతే ఒకటి వస్తుందని చెబితే అమ్మగారు మళ్లీ స్వస్థత ప్రార్థనచేశారు. ఒకరోజు దర్శనంలో అమ్మగారు మా ఇంటికి వచ్చి నాకు ఆపరేషన్ చేసి కడుపులో ఏం ఉంది? ఏమీ లేదు. ఇదిగో చూడు అన్నారు. నేను ఆనందంతో అమ్మగారు వచ్చి నాకు ఆపరేషన్ చేశారని, రండి, ఇంత అద్భుతకార్యం జరిగిందని అందరికీ చెబుతున్నాను. ఇప్పుడు 2 నెలలుగా మందిరానికి వెళ్తున్నాను. దీని తర్వాత షుగర్ 400, హై బి.పి. ఉండేది. షుగర్ తగ్గాలని అమ్మగారు ప్రార్థించారు. ఇప్పుడు షుగర్ 137, బి.పి. నార్మల్, కిడ్నీ నార్మల్ అయ్యింది. క్యాన్సర్ ఏమీ లేదనే రిపోర్ట్ వచ్చింది. నేను నా దయనీయ స్థితిలో ఏదైనా మందు తాగి చావాలనుకున్నాను. నా పిల్లలు నాకు ఎందుకు చాకిరీ చేయాలని బాధపడ్డాను. నాకు అన్నీ (మలమూత్రాలు) బెడ్‌పైనే అయ్యేవి. గనుక చనిపోవాలనుకున్నాను. అమ్మదగ్గరికి వచ్చాక, అమ్మగారు దర్శనంలో నాకు ఆపరేషన్ చేశాక నేను బాగయ్యాను. ఇంత ఆహారం తింటున్నాను. నా అంతట నేను లేచి తిరుగుతూ మామూలు వ్యక్తిగా మారాను. నన్ను అద్భుతముగా స్వస్థపరచిన దేవునికి స్తోత్రములు. నాకొరకు ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**16. ఎస్తేర్ శారద, బేగంపేట:** నేను 2002వ సంవత్సరంనుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాను. 2009 నుండి 2016 వరకు ట్రాన్స్‌ఫర్‌మీద కడప, అనంతపురం వెళ్లాను. 2016 జూలైలో అసిస్టెంట్ జాయింట్ కలెక్టర్‌గా రిటైర్డ్ అగుటకు, హైదరాబాద్‌లో సెటిల్ అవుటకు దేవుడు కృప చూపాడు. ఆ విధంగా తిరిగి యు.పి.ఎఫ్.లో కొనసాగవచ్చనే నా ఆశను దేవుడు తృప్తిపరచాడు. 2017 జనవరిలో నేను అమ్మగారితో నా ఆరోగ్యంకొరకు (ఆయాసం తగ్గాలని) ప్రార్థన చేయించుకొన్నాను. నా కూతురు, అల్లుడు సి.ఎం.సి. వెల్లూరులో ఉంటారు. చెకప్‌కు వెళ్తే సీరియస్ ప్రాబ్లమ్ అని, ఎమర్జెన్సీ అని ట్రీట్‌మెంట్ చేసి పంపారు. ఆ తర్వాత శుక్రవారం నీకు మేలు చేయవలెనని నేను నిన్ను బలపరుస్తున్నాను' అనే వాగ్దానము వచ్చింది. దేవుడు మేలు చేశాడు. అప్పుడు దేవుని సన్నిధిలో గడిపే సమయం లభించినందున 2017వ సంవత్సరంలో 40 రోజుల సిలువధ్యానాల్లో పాల్గొన్నాను. అద్భుతముగా నా కుమారుని వివాహము నిశ్చయమై వివాహము ఘనంగా జరిగింది. అలాగే ఫ్లాట్ కొరకు ప్రార్థించాను. 2017 జూన్‌లో నేను సిమ్లా, కశ్మీర్, హిమాలయాస్ టూర్‌కి వెళ్లాను. దేవుడు నాకు సురక్షితమైన ప్రయాణము అనుగ్రహించాడు. నేను తిరిగి వచ్చిన 2 వారాల్లో అక్కడ ఘోర ప్రమాదం జరిగింది. దేవుడు మమ్మును కాపాడాడు. నా కూతురు 40 రోజులు సిలువధ్యానాలలో 2 సార్లు హాజరై అమ్మగారితో ఎం.డి. సీటుకొరకు ప్రార్థన చేయించుకుంది. 2017 ఆగస్టులో ఆమె సెలెక్ట్ అయి కోయంబత్తూర్‌లో చేరింది. నా అల్లుడు డా॥ ఎడ్మండ్ కూడా వచ్చి అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నాడు. అతను న్యూరో సర్జన్. అమ్మగారు అతనిని అభినందించి ప్రార్థించారు. దేవుడు నిన్ను చాలా ఎత్తుకు తీసుకువెళ్తాడు అని ప్రవచించారు. 2017 నవంబర్‌లో అతను ప్రజెంట్ చేసిన రీసెర్చ్ పబ్లికేషన్‌లో ఉత్తమమైనది అయినందున గోల్డ్‌మెడల్ వచ్చింది. 29.11.2017న దేవుడు మా పరిస్థితులన్నీ అనుకూలపరచి అల్వాల్‌లో త్రీ బెడ్‌రూం ఫ్లాట్ అనుగ్రహించాడు. మరియు 7.1.18న పెద్ద యాక్సిడెంట్‌నుండి దేవుడు నా కుమార్తెని

తప్పించాడు. దేవునికి స్తోత్రములు. మా కొరకు ప్రార్థించిన అమ్మగారికి మా వందనములు.

**17. యు. రవికుమార్, నారాయణగూడ:** మేము 15 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్. సంఘానికి కుటుంబ సమేతముగా వస్తూ ఎన్నో మేళ్ళు, ఆత్మీయ ఆశీర్వాదములు పొందాము. నేను 2016 డిసెంబర్‌నుండి కడుపు ఎడమవైపు భాగంలో నొప్పితో బాధపడుచున్నాను. డాక్టర్స్‌కి చూపిస్తే కిడ్నీలో రాళ్ళు ఉన్నాయని చెప్పారు. ఇంజక్షన్ తీసికుంటే నొప్పి తగ్గింది. నొప్పి తగ్గింది గదా అని నిర్లక్ష్యం చేశాను. తర్వాత 2017 ఏప్రిల్‌లో 10 రోజులు కడుపులో విపరీతమైన నొప్పితో బాధపడ్డాను. వైద్యులను సంప్రదిస్తే అల్ట్రాసౌండ్ చేసి గాల్‌బ్లాడర్‌లో, అన్నవాహికలో రాళ్లు ఉన్నాయి వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. మేము ఇతర ప్రముఖ హాస్పిటల్స్‌లో స్పెషలిస్ట్‌లకు చూపించినా వారూ వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. మేము 15.04.17, శనివారము ఉదయం అమ్మగారు సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన స్తుతికూడికలో పాల్గొని వెళ్లాము. తర్వాత తీవ్రమైన కడుపునొప్పి వచ్చి తట్టుకోలేకపోయాను. నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్తే హార్ట్‌బీట్ పరీక్షించి అడ్మిట్ చేసికొని సెలైన్స్ ఎక్కించారు. గాని మరి ఏ ట్రీట్‌మెంట్ ఆరంభించలేదు. మాకు భయం వేసి అక్కడినుండి ఏషియన్ ఇనిస్టిట్యూట్‌కు వెళ్లినప్పుడు వెంటనే అడ్మిట్ అయిపోండి ఆపరేషన్‌కు మొత్తము 1,20,000/- రూపాయలు ఖర్చు అవుతుంది. మొదట 30,000/-రూపాయలు అడ్వాన్స్ చెల్లించమన్నారు. మేము నొప్పి తగ్గడానికి ఇంజెక్షన్, మందులు ఇవ్వండి; 17.04.17, సోమవారం వచ్చి అడ్మిట్ అవుతామంటే వారు సంతకాలు తీసికొని ఇంజెక్షన్, మందులు ఇచ్చి పంపించారు. మేము 16.04.17, ఆదివారం యు.పి.ఎఫ్. ఈస్టర్ ఆరాధనకు ఉస్మానియా గార్డెన్స్‌కి వచ్చి అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నాము.

అప్పుడు అమ్మగారి దగ్గర విషయం (గాల్‌బ్లాడర్, అన్నవాహికలో రాళ్లు ఉన్నాయి. రెండు ఆపరేషన్స్ చేయాలంటున్నారు) చెప్పినప్పుడు అమ్మగారు "వారు ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) **సూర్యోదయమైనప్పుడు సమాధియొద్దకు వచ్చుచుండగా - సమాధి ద్వారమునుండి మనకొరకు ఆ రాయి యెవడు పొర్లించునని ఒకరితో ఒకరు చెప్పుకొనుచుండిరి. వారు వచ్చి కన్నులెత్తిచూడగా, రాయి పొర్లింపబడి యుండుట చూచిరి. ఆ రాయి యెంతో పెద్దది."** - మార్కు 16:2-4 అనే వాక్యము ఆధారంగా - యేసు ప్రభువు సమాధికి ఉన్న రాయి తొలగింపబడింది; నీ గాల్‌బ్లాడర్‌లోని రాళ్లు తొలగించుట ఆయనకు అసాధ్యమా? నీ రాళ్లన్నీ మటుమాయం అవుతాయి; బిడ్డా, నీకు ఏమీ కాదు అని చెప్పి ప్రార్థించి ధైర్యం చెప్పి పైన చెప్పిన వాగ్దానం మరియు జీవపుమాటలు పుస్తకం ఇచ్చారు. 17.04.17, సోమవారం మేము ఆపరేషన్‌కు సిద్ధపడి హాస్పిటల్‌కు వెళ్లాము. వారు ఎండోస్కోపి, ఎం.ఆర్.ఐ. స్కాన్ చేస్తున్నప్పుడు నా భార్య **"జీవపు మాటలు"** పుస్తకంలోని స్వస్థత వాగ్దానాలు చదివింది. డాక్టర్స్ ఆపరేషన్‌కు సిద్ధము చేసికున్నారు. అన్నవాహిక మూసుకుపోయిందని దానికి స్టెంట్ వేశారు. రాళ్లన్నీ వాషన్‌లో వెళ్లేటట్లు చేశారు. 18.04.17, మంగళవారం **"జీవపుమాటలు"** పుస్తకంలోని కాపుదల వాగ్దానాలు చదవడం ఆరంభించగానే దేవుడు విడుదల ఇచ్చాడు. 18.04.17, మంగళవారం రాత్రి ట్రీట్‌మెంట్ ఆరంభించారు. 19.14.17, బుధవారం డిశ్చార్జ్ చేశారు. రెండు ఆపరేషన్లు చేయాలన్నారు గాని అమ్మగారి ప్రార్థనవలన కత్తివాత పడకుండా దేవుడు నన్ను కాపాడాడు. దేవుడు తన సేవకుల మాటను రూఢీపరచి ఆపరేషన్ కాకుండా గొప్ప విడుదల, స్వస్థత ఇచ్చాడు. తర్వాత ఎండోస్కోపి, ఎం.ఆర్.ఐ. స్కాన్ చేస్తే రాళ్లు ఏమీ లేవు. మరో గొప్పకార్యం ఏమిటంటే హాస్పిటల్‌కు రాకముందే ఇంటివద్ద మూత్ర విసర్జన చేసినప్పుడు "టప్" మనే శబ్దంతో కిడ్నీలో ఉన్న రాళ్లు పడిపోయినవి. నొప్పికూడా తగ్గిపోయింది. స్కాన్ తీసినప్పుడు ఆ రాళ్ల జాడకూడా కనబడలేదు. దేవునికి స్తోత్రములు. మాకొరకు ప్రార్థించి వాక్యంచేత బలపరచిన అమ్మగారికి వందనములు.

## యు.పి.ఎఫ్. ఇతర సేవా కార్యక్రమాలు

- ☞ ప్రతి రోజు **"ఉదయకాల ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి 7 గం॥ల వరకు
- ☞ ప్రతి ఆదివారము **"ప్రభాత ఆరాధన"** ఉదయము 6.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు.
  స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో
- ☞ ప్రతి ఆదివారము **"ఇంగ్లీషు ఆరాధన"** సాయంత్రం 4.00గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు మరియు **"తెలుగు ఆరాధన"** సాయంత్రం 6.00గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
  స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్ - 500 044.
- ☞ ప్రతి ఆదివారము "సండే స్కూల్" ఉ॥ 7.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు. మరియు సా॥ 4 గం॥ల నుండి 6 గం॥ల వరకు (స్థలము : యు.పి.ఎఫ్. విలాసములో)
- ☞ ప్రతి సోమవారము "మెన్స్ ప్రేయర్ ఫెలోషిప్" సాయంత్రం 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు.
- ☞ ప్రతి సోమవారము **"తల్లుల సహవాసము"** సా॥ 6 గం.ల నుండి రా॥ 8.30 ని.ల వరకు.
- ☞ ప్రతి మంగళవారము "ప్రార్థన కూడిక" ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1.00 గంట వరకు.
- ☞ ప్రతి గురువారము "ప్రత్యేక విజ్ఞాపన ప్రార్థన & యౌవన స్త్రీల సహవాసము" సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు
- ☞ ప్రతి శుక్రవారము **"ఉపవాస ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ వరకు మరియు ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1 గం॥ వరకు మరియు సా॥ 5.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు. **రోగులకొరకు ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**
- ☞ ప్రతి శనివారము **"వృద్ధుల సహవాసము"** మ॥ 2.00 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు. **"యౌవన పురుషుల సహవాసము"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
- ☞ ప్రతి నెల మొదటి శనివారము **"సేవకురాండ్ర సదస్సు"** ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ల వరకు.యు.పి.ఎఫ్. రాంనగర్‌లో
- ☞ ప్రతి నెల రెండవ గురు, శుక్ర, శనివారము మూడు రోజులు **"ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు"** ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ల వరకు, ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు, సా॥ 5 గం॥ల నుండి రాత్రి 9 గం॥ల వరకు యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో జరుగును.
- ☞ ప్రతి నెల ఆఖరి బుధవారము **"సంపూర్ణ రాత్రి పార్థన"** రాత్రి 9.00 గం॥ల నుండి ఉ॥ 5.00 గం॥ల వరకు
  **స్థలము: సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్.**
- ☞ అవసరతల చొప్పున గృహ కూడికలు, గృహ సందర్శనములు, రోగులకొరకు ప్రార్థనలు జరుపబడును.

# పుస్తకములు & సి.డి. పరిచర్య

జాయ్ చెరియన్ గారు ప్రసంగించిన ప్రసంగములు సి.డి. రూపములో మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును.

పోస్టుద్వారా పుస్తకములు కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

| | |
|---|---|
| **దేవుని వెయ్యి ఆదేశములు (1-300) (సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **మీ హృదయము కలవరపడనియ్యకుడి (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నా ప్రాణ ప్రియుడు (వి.సి.డి. & సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నూతన సంవత్సర తీర్మానములు (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **క్రిస్మస్ వేడుకలు (డి.వి.డి.)** | **వెల రూ. 30/-** |
| **కాపరి లక్షణములు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **తల్లులకు హెచ్చరికలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసి యాత్ర కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుడు కోరునది (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **దేవుని వెయ్యి నామములు (MP3)** | **వెల రూ. 40/-** |
| **నిన్ను విడువను నిన్ను ఎడబాయను (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నూతన సంవత్సరము - దిద్దుబాటు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **శుభకరమైన ఆనవాలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసురాలైన తల్లి (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సిలువ ధ్యాన కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుని యొద్దనుండి ఒక మాట (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నన్నాశ్రయించుడి, నన్నాశ్రయించినయెడల మీరు బ్రతుకుదురు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సంఘ పరిచర్యలో స్త్రీలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **మీరు లోకమునకు వెలుగైయున్నారు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రొత్త మనస్సు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రైస్తవ కుటుంబము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **బలిపీఠంమీద నిత్యం అగ్ని మండుచుండవలెను... (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **స్త్రీలు - పరిశుద్ధత, పరిశుభ్రత (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ప్రభువా! నాకు సహాయము చేయుము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ఆయన సమస్తమును మనకు అనుగ్రహించును (సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ఈ నది ఎక్కడ పారును... (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **పక్షిరాజు విశ్వాసి (వి.సి.డి.)** | **వెల రూ. 50/-** |
| **స్త్రీలు మౌనముగా ఉండవలెనా? 1 & 2 (వి.సి.డి.)** | **వెల రూ. 50/-** |
| **ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను. (డి.వి.డి.)** | **వెల రూ. 50/-** |
| **హృదయపరీక్ష (MP3)** | **వెల రూ. 60/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని నామములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని వాగ్దానములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

| | |
|---|---|
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - II**<br>101-200 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - III**<br>201-300 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - IV**<br>301-400 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - V**<br>401-500 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VI**<br>501-600 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VII**<br>601-700 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VIII**<br>701-800 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - IX**<br>801-900 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 150/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - I** | **వెల రూ. 100/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - II** | **వెల రూ. 100/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - III** | **వెల రూ. 100/-** |
| **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) | **వెల రూ. 150/-** |
| **"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 20/-** |
| **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"నన్ను మలిచిన నా దేవుడు"**జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) | **వెల రూ.10/-** |
| **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లిషు, తెలుగు &హిందీ) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"నూతర సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లిషు) | **వెల రూ. 60/-** |

"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును." - యోహాను 14:14

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF) నిర్వహించు**

# సంపూర్ణ రాత్రి ప్రార్థన

**అందరికీ ఆహ్వానము**

**తేది : 25 ఏప్రిల్ 2018 (బుధవారం)**
**సమయము : రా॥ 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**స్థలము : సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.**

RNI. No. APTEL 2007/24270



**మీకు మీ సెల్‌లో ప్రతి రోజు దేవుని వాక్యము కావలెనా?**

ప్రతి రోజు దేవుని వాగ్దానము SMS మీ సెల్‌ఫోన్‌లో పొందాలంటే ఈ ఫారమ్ పూర్తి చేసి ఈ దిగువ నున్న అడ్రస్ కు పంపండి. ఒక్క ఫారమ్ ఒక్క నెంబర్‌కే పరిమితం.

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
## UNITED PEOPLE'S FELLOWSHIP (UPF)

# 1-9-52/E/3, Ramnagar, Hyderabad - 500 020. Phone : **27624030/1**

Name / పేరు :____________________

Address
చిరునామా :____________________

____________________

____________________PIN : | | | | | |

Your Church Name
మీ సంఘము పేరు :____________________

Mobile Number for SMS subscription / SMS సభ్యత్వం కొరకు సెల్ నంబర్

| | | | | | | | | | |

Date :                                        ..............................................
Signature

---

*ప్రార్థించండి!*     **ప్రకటన**     *పాల్గొనండి!*

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 20.**
**ఫోన్ : 040-27624030/31, 29704032**

**ప్రతి ఆదివారము**

## ఉదయకాల ఆరాధన

**ఉ॥ 6 గం॥ల నుండి 9 గం॥ల వరకు**

స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో

మరియు

## సాయంకాల ఆరాధనలు

**ఇంగ్లీష్ : సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు**

**తెలుగు: సా॥ 6 గం॥ల నుండి రాత్రి గం॥ 8-30 ని॥ల వరకు**

స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్,
హైదరాబాద్ - 500 044. తెలంగాణ.

**అందరికీ ఆహ్వానము**     **- జాయ్ చెరియన్**

---

**యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము**

# "జీవపు మాటలు"

## కల్వరి ఛానెల్‌లో

**ప్రతి రోజు ఉ॥ 5.30 గం॥లకు మరియు ఉ॥ 10.00 గం॥లకు**

## రక్షణ ఛానెల్‌లో

**ప్రతి రోజు ఉ॥ 6.00 గం॥లకు**

## శుభవార్త ఛానెల్‌లో

**ప్రతి రోజు సోమ నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు**
**ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు**
**ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు**

## గాస్పెల్ ఛానెల్‌లో

**ప్రతి రోజు ఉ॥ 10.30 ని॥లకు మరియు రా॥ 7.00 గం॥లకు**

## ఆరాధన ఛానెల్‌లో

**ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు**

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో
– జాయ్ చెరియన్

మా చిరునామా :

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

**# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి, మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్ -20.**
**ఫోన్ : 040-27624030 / 31, 29704032**

***VISIT US AT :***
***Email : joycherian@hotmail.com,***
**www. unitedpeoplesfellowship.org**

ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

**www.unitedpeoplesfellowship.org**

**Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship, # 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn, Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 040-27624030, 27624031**

Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862

This document was created with the Win2PDF “print to PDF” printer available at
http://www.win2pdf.com

This version of Win2PDF 10 is for evaluation and non-commercial use only.

This page will not be added after purchasing Win2PDF.

http://www.win2pdf.com/purchase/